నవతెలంగాణ
1
ఆదిలాబాద్
మంగళవారం | జూన్ 11, 2024 | www.navatelangana.com

గ్రూప్-1 అభ్యర్థికి చేదు అనుభవం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గ్రూప్-1 పరీక్షకు జిల్లా కేంద్రానికి చెందిన మహిళా అభ్యర్థికి చేదు అనుభవం ఎదురైంది. పట్టణంలోని మావలలోని చావర ఆకాడమీ సెంటర్‌లో విచిత్ర ఘటన చోటుచేసుకుంది. ఆధార్ కార్డులో డాటర్ ఆఫ్‌కు బదులుగా వైఫ్ ఆఫ్ ఉన్నందుకు నిర్వాహకులు అభ్యర్థిని బయటకు పంపారు. గ్రూప్-1కు దరఖాస్తు వివాహం జరగక ముందు చేసుకున్నామని, ఇప్పుడు వివాహం జరిగింది కాబట్టే వైఫ్ ఆఫ్ ఉందని నిర్వాహకులకు ఎంత చెప్పినా లోనికి అనుమతించేందుకు ససేమిరా అన్నారు. అయితే నిర్వాహకులు అడ్రస్ ప్రూఫ్ చూపించాలని తెలిపారు. వారివద్ద లేదని చెప్పడంతో అడ్రస్ ప్రూఫ్ చూపిస్తే లోనికి అనుమతించడమా? వద్దా? అనేది క్లారిటీ ఇస్తామన్నారు. దీంతో అడ్రస్ ప్రూఫ్ కోసం ఇంటికి పరుగులు పెట్టారు. ఆమె తిరిగి వచ్చేసరికి నిమిషం ఆలస్యం కావడంతో అధికారులు ఎగ్జామ్ హాల్లోకి అనుమతించలేదు. గ్రూప్-1 పరీక్షకు అభ్యర్థి దూరం కావడంతో కన్నీరుమున్నీరుగా విలపించింది. పెళ్లైన తరువాత వైఫ్ ఆఫ్ కాకుండా డాటర్ ఆఫ్ ఎందుకు ఉంటుందని ఆమె ప్రశ్నించారు. అధికారుల తీరుపై మండిపడ్డారు.

ఇంటింటికీ తాగు నీరు సరఫరా చేయాలి

నవతెలంగాణ-కౌటాల

జిల్లాలోని ప్రతి ఊరిలో ఇంటింటికీ తాగు నీటి సరఫరా జరిగేలా చూడాలని, దీని కోసం వాస్తవ పరిస్థితిని కొత్తగా తెచ్చిన మిషన్ భగీరథ యాప్‌లో నమోదు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతిగౌడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో సిర్పూర్, కౌటాల, చింతలమానేపల్లి మండలాల కు చెందిన ఎంపిడిఓ, ఎంపీఓ, పంచాయతీ సెక్రటరీలు, ఉపాధి హామీ, ఐకేపీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో ప్రస్తుతం నీళ్ల అందుతున్న వివరాలు ప్రత్యేక యాప్‌లో పది రోజుల్లో నమోదు చేయాలని ఆదేశించారు. టీమ్ అందరూ టార్గెట్ కంప్లీట్ చేసేందుకు పని చేయాలని తెలిపారు. యాప్‌లో ప్రతి ఇంటి యజమాని, కుటుంబ సభ్యుల వివరాలు, రోజుకు ఎన్ని లీటర్ల నీటి వినియోగం చేస్తున్నారు, ఆధార్ కార్డ్, సెల్‌ఫోన్ నెంబర్ సహా అన్ని వివరాలు నమోదు చేసి పకడ్బందీ డాటా ఎంట్రీ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంపిడివోలు సత్యనారాయణ, ప్రసాద్, రమేష్‌రెడ్డి, ఎంపీఓ మహేందర్‌రెడ్డి, కృష్ణమూర్తి, ఏపీఎంలు దుర్గయ్య, ముక్తేశ్వర్ పాల్గొన్నారు.

పైసలు రాక..పెట్టుబడి లేక..!

- ఖాతాల్లో జమ కాని జొన్న పంట డబ్బులు
- విక్రయించి నెల రోజులు గడుస్తున్నా దరిచేరని వైనం
- వచ్చినవి రూ.30కోట్లు..రావాల్సినవి రూ.84కోట్లు
- చేతిలో చిల్లిగవ్వ లేక అన్నదాతల అవస్థలు

ప్రతికూల పరిస్థితులను అధిగమించి పంట పండించిన రైతులు..చివరకు పంట అమ్మిన డబ్బుల కోసమూ నిరీక్షించాల్సిన పరిస్థితి వచ్చింది. మార్కెట్‌లో జొన్న పంట విక్రయించి నెల రోజులు గడుస్తున్నా డబ్బులు అన్నదాతల చేతికందడం లేదు. పంట డబ్బులు చేతికి రాక..చేతిలో చిల్లి గవ్వ లేక ఖరీఫ్ పెట్టుబడికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో విత్తనాలు, ఎరువులు, ఇతరాత్ర పనిముట్లు కొనుగోలు చేసేందుకు డబ్బులు లేక సతమతమవుతున్నారు. నెల రోజులు గడుస్తున్నా రైతుల ఖాతాల్లో జమ కాకపోవడంతో వాటి కోసం ఆశగా ఎదురుచూడాల్సి వస్తోంది. ఆదిలాబాద్ జిల్లాకు ప్రభుత్వం నుంచి రూ.114కోట్ల పంట డబ్బులు రావాల్సి ఉండగా ప్రస్తుతం రూ.30కోట్లు మాత్రమే వచ్చాయి. మిగిలిన వాటి కోసం అన్నదాతలు ఆతృతగా ఎదురుచూడాల్సి వస్తోంది.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

జిల్లాలో రైతులు ఖరీఫ్ సాగుతో పాటు రబీలోనూ పంటలు పండిస్తుంటారు. ఏటా ఖరీఫ్‌లో వచ్చిన నష్టాలను పూడ్చుకునేందుకు అనేక మంది రైతులు రబీ పంటలపైనే ఆధారపడుతుంటారు. జిల్లాలో కిందటి రబీ సీజన్‌లో ఆదిలాబాద్ జిల్లాలో 16,902మంది రైతులు జొన్న పంటను సాగు చేశారు. కిందటేడాది సంభవించిన అకాల వర్షాలకు పంట నష్టం జరగగా.. మిగిలిన పంటను రైతులు కాపాడుకున్నారు. ఇలా జిల్లా వ్యాప్తంగా 75వేల ఎకరాల్లో జొన్న పంట వేయగా.. సుమారు 3.60లక్షల క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఈ పంటను మార్కెట్‌లో విక్రయించగా.. వారం, పది రోజులకు ప్రభుత్వం డబ్బులు జమ చేయాల్సి ఉండగా.. నెల రోజులు గడుస్తున్నా రైతుల ఖాతాలకు చేరకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో తొమ్మిది కేంద్రాల 3.60లక్షల క్వింటాల్‌ల జొన్నలను కొనుగోలు చేశారు. వీటికి సంబంధించి జిల్లాలో రూ.114కోట్ల బకాయిలు రావాల్సి ఉండగా కేవలం రూ.30కోట్లు మాత్రమే వచ్చాయి. మిగితా డబ్బులు ఇంకా ప్రభుత్వం నుంచి రావాల్సి ఉంది.

పెట్టుబడికి ఇబ్బందులు..!

రైతులు ప్రతి ఏటా ఖరీఫ్‌లో పండించిన పంటకు సంబంధించి డబ్బులను అనేక మంది రైతులు వారి పాత బకాయిలు చెల్లించడం, ఇంట్లో రోజువారీ ఖర్చులకు వినియోగిస్తుంటారు. మరుసటి ఏడాది పంట పెట్టుబడి కోసం ఎక్కువ మంది రైతులు రబీ సాగుపైనే ఆధారపడుతుంటారు. యాసంగిలో వేసిన పంట అమ్మిన తర్వాత వచ్చే డబ్బులను రానున్న ఖరీఫ్ సీజన్ కోసం వెచ్చిస్తుంటారు. కానీ జొన్న పంట విక్రయించి నెల రోజులు గడుస్తున్నా వాటికి సంబంధించి డబ్బులు రైతుల ఖాతాల్లో జమ కావడం లేదు. దీంతో తాజా ఖరీఫ్ సీజన కోసం విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, ఇతరాత్ర పనిముట్లు కొనుగోలు చేసేందుకు రైతుల వద్ద డబ్బులు లేకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇతరుల వద్ద వడ్డీ రూపేణా అప్పులు తీసుకోవాల్సిన పరిస్థితి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



వెంటనే డబ్బులు చెల్లించాలి : బండి దత్తాత్రి, రైతు సంఘం నాయకుడు

రబీ సీజన్‌లో పండించిన జొన్న పంటను మార్కెట్‌లో విక్రయించిన రైతులకు ఇప్పటికీ డబ్బులు ఖాతాలో జమ కాకపోవడం సరికాదు. డబ్బులు రావడం ఆలస్యం అవుతుండటంతో వారికి రానున్న పంట పెట్టుబడి కోసం ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం ఈ సమస్యపై తక్షణం దృష్టిసారించి రావాల్సిన బకాయిలను విడుదల చేసి రైతులకు అందజేయాలి.



పంట డబ్బులు త్వరగా చెల్లించాలి : రామగిరి విఠల్, రైతు, భరంపూర్

నెల రోజుల క్రితం 75క్వింటాల్‌ల జొన్నలు విక్రయించాను. వాటికి సంబంధించి డబ్బులు ఇప్పటికీ ఖాతాలో జమ కావడం లేదు. ఖరీఫ్‌లో విత్తనాలు, ఎరువులు, పనిముట్లు తదితర పంట పెట్టుబడి కోసం డబ్బులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ప్రభుత్వం, అధికారులు స్పందించి త్వరగా డబ్బులు జమ అయ్యేలా చొరువ తీసుకోవాలి.

రెండు రోజుల్లో డబ్బులు వస్తాయి : ప్రవీణ్‌రెడ్డి, మార్క్‌ఫెడ్ డీఎం

జిల్లాలో రబీ సీజన్‌లో కొనుగోలు చేసిన జొన్న పంటకు సంబంధించి డబ్బులు రెండు, మూడు రోజుల్లో వస్తాయి. రూ.30కోట్లు వచ్చాయి. మిగితా రూ.84 కోట్లు రావాల్సి ఉంది. ఇప్పటికే ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాము. ప్రభుత్వం డబ్బులు విడుదల చేయగానే రైతుల ఖాతాల్లో జమ చేసేలా చర్యలు తీసుకుంటాం.

బదిలీలు, పదోన్నతులు పారదర్శకంగా నిర్వహించాలి

- టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతికుమారి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు పారదర్శకంగా నిర్వహించాలని టిఎస్‌యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శాంతికుమారి, ఇందూరావు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని జనకాపూర్ ఉన్నత పాఠశాలలో బదిలీలు పదోన్నతుల కోసం ఏర్పాటు చేసిన ధ్రువపత్రాల పరిశీలన కేంద్రాన్ని సందర్శించి అనంతరం జిల్లా విద్యాధికారి అశోక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బదిలీలు, పదోన్నతులు నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించాలని, ఎటువంటి అవకతవకలకు తావివ్వకుండా ప్రక్రియ సజావుగా కొనసాగించాలని కోరారు. కేజీబీవీ ఉద్యోగుల రెన్యువల్స్ కూడా సకాలంలో పూర్తి చేయాలని ప్రాతినిధ్యం చేశామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు హేమంత్ షిండే, కోశాధికారి తంగడిపల్లి రమేష్, జాదవ్ సుభాష్ పాల్గొన్నారు.

జేఈఈ అడ్వాన్స్ ర్యాంకర్‌కు సన్మానం



నవతెలంగాణ - వాంకిడి

మండల కేంద్రంలో నిరుపేద కుటుంబానికి చెందిన దుర్గం మహేందర్ కుమారుడు దుర్గం అర్జున్ జేఈఈ అడ్వాన్స్‌లో ఆలిండియా స్థాయిలో 1782 ర్యాంకు సాధించినందుకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సంఘం భారతీయ బౌద్ధ మహాసభ ఆధ్వర్యంలో సోమవారం జశ్వంత్ బుద్ధవిహార్‌లో సన్మానించారు. ఈ సందర్భంగా బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు అశోక్ మాట్లాడుతూ దుర్గం అర్జున్ తండ్రి ఏడు నెలల క్రితం చనిపోయినా దిగమింగుకొని పట్టుదలతో చదువుకొని ఎలాంటి కోచింగ్ లేకుండా జేఈఈ అడ్వాన్స్‌లో 1782 ఆలిండియా ర్యాంకు సాధించి యువ తరానికి ఆదర్శంగా నిలిచాడని కొనియాడారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న అర్జున్ పట్టుదలను కళాశాల ప్రిన్సిపాల్ సంపత్‌కుమార్, అధ్యాపకులు అభినందించారు. కార్యక్రమంలో వీఎస్‌ఐ ఉపాధ్యక్షుడు వినేష్ ఉప్రె, అంబేద్కర్ సంఘం ఉపాధ్యక్షుడు సునీల్, కార్యదర్శి రోషన్, సహాధ్యక్షుడు విజయ్ ఉప్రె, దుర్గం శ్యాంరావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుర్నులే నారాయణ, యువజన సంఘం నాయకులు ప్రశాంత్, సందీప్, అరుణ్, ప్రతాప్, పాండు, దీపక్, కమలాకర్ పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు గోదావరిలో పడి వ్యక్తి మృతి



నవతెలంగాణ-జైపూర్

శివ్వారం గ్రామానికి చెందిన బైరి మధుగౌడ్(55) ప్రమాదవశాత్తు గోదావరి నదిలో పడి మృతి చెందాడు. కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం మంథని సమీపంలో గల గంగపురి గ్రామంలో బంధువు అంత్యక్రియలకు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో కుటుంబ సభ్యులతో కలిసి రాకుండా మంథని నుండి గోదావరి నది మీదుగా శివ్వారం చేరుకోవాలని భావించాడు. గోదావరిలో దిగిన ఆయన ప్రమాదవశాత్తు మడుగులో మునిగినట్లు గ్రామస్తులు, బంధువులు తెలిపారు. కుటుంబ సభ్యులతో కలిసి ఆటోలో రావల్సిన మధుగౌడ్ తాళ్ల ఎక్కడం కోసం నేరుగా శివ్వారం చేరుకోవాలని గోదావరి నది మీదుగా ప్రయాణించినట్లు పేర్కొన్నారు. చీకటి పడినా ఇల్లు చేరకపోవడంతో కుటుంబ సభ్యులు ఆయన కోసం వెతకడం ప్రారంభించారు. సోమవారం ఉదయం మృతదేహం గోదావరి నదిలో గుర్తించారు. మృతునికి భార్య లక్ష్మి, ఇద్దరు కూతుళ్ల ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు.

నేడు విద్యుత్ అదాలత్

నవతెలంగాణ - వాంకిడి

మండల విద్యుత్ వినియోగదారులకు ఈ నెల 11న ఉదయం 9గంటలకు విద్యుత్ కార్యాలయంలో సమస్యల పరిష్కారానికి విద్యుత్ అదాలత్ నిర్వహిస్తామని విద్యుత్ అధికారులు తెలిపారు. వినియోగదారులు విద్యుత్ బిల్లుల సమస్యలుంటే పరిష్కార వేదిక వద్దకు వచ్చి పరిష్కరించుకోవాలన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏడీఈ శ్రీనివాస్, ఏఈ ఈశ్వర్, శ్రీకాంత్, ఏఏఈ తుకారాం కోరారు.

డీఎడ్ దరఖాస్తుల గడువు పొడిగింపు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

డీఎడ్ కళాశాలలో చేరేందుకు నిర్వహించే ప్రవేశ పరీక్షకు దరఖాస్తు గడువును పొడిగించినట్లు ఆదిలాబాద్ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. రవీందర్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు ఈ నెల 30 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశ పరీక్ష జులై 10న ఆన్‌లైన్‌లో ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాలకు డీసెట్.సీడీఎస్ఈ.తెలంగాణ.గౌ.ఇన్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

అనుమతుల కోసం సమన్వయంతో ముందుకు సాగుదాం

- జిల్లా అటవీ శాఖ అధికారి నీరజ్ కుమార్ టిబ్రేవాల్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని వివిధ రహదారులు టవర్ల నిర్మాణం కోసం కావాల్సిన అటవీ అనుమతుల కోసం అన్ని శాఖలు సమన్వయంతో ముందుకు సాగాలని జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్ కుమార్ టిబ్రేవాల్ అన్నారు. జిల్లాలోని వివిధ శాఖల ఆధ్వర్యంలో పెండింగ్‌లో ఉన్న 24రహదారులతో పాటు వివిధ టవర్ల నిర్మాణాలపై ఎమ్మెల్యే కోవ లక్ష్మితో కలిసి వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని రోడ్లు, భవనాల శాఖలో 12 అనుమతులు రావాల్సి ఉందన్నారు. వీటిలో 11 కాంట్రాక్టర్ల వద్ద పెండింగ్‌లో ఉన్నాయని, 1 రాష్ట్ర కార్యాలయంలో పెండింగ్‌లో ఉందని తెలిపారు. పంచాయతీరాజ్ విభాగంలో 7 రోడ్లకుగాను 5 రోడ్లు కాంట్రాక్టర్ వద్ద, 2 రహదారుల అనుమతులు మంత్రిత్వ శాఖ వద్ద పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. ఐటీడీఏ పరిధిలో ఉన్న 5 రోడ్లకు కాంట్రాక్టర్ వద్ద పెండింగ్ ఉందని తెలిపారు. అలాగే జియో టవర్ నిర్మాణంలో భాగంగా 6లో 5 కాంట్రాక్టర్ వద్ద, 1 తన వద్ద పెండింగ్ ఉన్నట్లు వివరించారు. బిఎస్ఎన్ఎల్, ఎయిర్‌టెల్ టవర్లకు సంబంధించి 7లో 4 కాంట్రాక్టర్ వద్ద, 2 మంత్రిత్వ శాఖ వద్ద, 1 జిల్లా కార్యాలయంలో పెండింగ్ ఉందన్నారు. జిల్లాలో వివిధ పనులకు సంబంధించి అటవీ శాఖ అనుమతులు ఇవ్వడానికి సిద్ధంగా ఉందని, అయితే దరఖాస్తులు సరైన విధంగా ఉండేలా చూడాల్సిన బాధ్యత ఆయా శాఖలపై ఉంటుందన్నారు. టెండర్ ప్రారంభ ప్రక్రియలోనే అటవీశాఖ అనుమతి తీసుకొని పని ప్రారంభిస్తే ఇబ్బందులు రావాన్నారు. వివిధ శాఖల అధికారులు ఈ విషయం తెలిసి కూడా అటవీ శాఖను దోషిగా ప్రజల వద్ద నిలబెట్టడం సరైన విధానం కాదన్నారు. వివిధ శాఖల నుండి వచ్చే ప్రతిపాదనలు పెండింగ్ లేకుండా చూస్తానని, ఎప్పటికప్పుడు అనుమతులు వచ్చే విధంగా రాష్ట్ర కార్యాలయంతో సంప్రదిస్తానని తెలిపారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు కాకుండా అనుమతులు త్వరితగతిన వచ్చేలా చూడాలన్నారు. జిల్లాలో ఎక్కువగా అటవీ ప్రాంతంతో ముడిపడి ఉన్న రహదారులు ఉన్నాయని, వాటి నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ రేంజ్ అధికారి అప్పలకొండ, రహదారులు భవనాలు శాఖ ఈఈ పెద్దన్న, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కత్తితో బెదిరించిన ముగ్గురి అరెస్ట్

- పరారీలో ఒకరు..వివరాలు వెల్లడించిన డీఎస్పీ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మద్యం కావాలని ఓ వైన్స్ షాప్‌లో తల్వార్‌తో బెదిరించిన ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ జీవన్‌రెడ్డి తెలిపారు. సోమవారం పట్టణంలోని టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ నెల 6న పట్టణంలోని తిర్పల్లిలో గల ఓ వైన్స్‌లో నలుగురు వ్యక్తులు తల్వార్‌ను చూపించి మద్యం ఇవ్వాలని, ఇవ్వకుంటే చంపేస్తామని, షాపును ధ్వంసం చేస్తామని బెదిరించారు. ఈ మేరకు షాప్ యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు నలుగురు వ్యక్తులపై టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఇందులో ఏ1 షేక్ నౌషద్, ఏ2 లాలు, ఏ3 షేక్ ఇర్ఫాన్ ముగ్గురిని అరెస్ట్ చేయగా ఏ4 అజ్మత్ ఖురేషి పరారీలో ఉన్నాడు. వీరిపై గతంలో కూడా పలు దొంగతనం, బెదిరింపు కేసులున్నాయి. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా బెదిరించిన వారిపై నాన్ బెయిలబుల్ సెక్షన్లను నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ తెలిపారు. వ్యాపారస్తులను పాత నేరస్తులు, రౌడీ షీటర్లు డబ్బుల కోసం బెదిరింపులకు పాల్పడితే పోలీసులను సంప్రదించాలని సూచించారు. నిందితుల నుండి ఒక సెల్‌ఫోన్, తల్వార్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను గుర్తించి పట్టుకోవడంలో ముఖ్యపాత్ర పోషించిన టూటౌన్ సిబ్బంది రమేష్, నరేష్, క్రాంతిని అభినందించారు. సమావేశంలో సీఐ అశోక్, సిబ్బంది ఉన్నారు.

డీఎస్పీ ప్రతిపాదించిన రాష్ట్ర రాజ చిహ్నాన్ని ఆమోదించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన రాష్ట్ర రాజ చిహ్నాన్ని మార్చి, ధర్మ సమాజ పార్టీ ప్రతిపాదించిన రాజ చిహ్నాన్ని ఆమోదించాలని ధర్మసమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు గణేష్ మహారాజ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ చారిత్రాత్మక విలువలను రాష్ట్రంలో తమ పార్టీ నూతన రాజ చిహ్నాన్ని ప్రతిపాదిస్తూ కలెక్టర్‌కు నమూనా అందించినట్లు పేర్కొన్నారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఉస్మానియా యూనివర్సిటీ, ఆ యూనివర్సిటీ నుండి డాక్టరేట్ పొందిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ ప్రతిమను, తెలంగాణలో అణగారిన ప్రజల విముక్తి కోసం అగ్రవర్ణ భూస్వాముల మీద యుద్ధం చేసిన పండగ సాయన్న, సర్దార్ పాపన్నగౌడ్, సమ్మక్క సారలక్కలతో కూడిన రాజ చిహ్నాన్ని ప్రతిపాదించినట్లు తెలిపారు. పార్టీ రూపొందించిన ఆ చిన్నం ద్వారా తెలంగాణ వీరుల పోరాట స్ఫూర్తి, తెలంగాణ సాంస్కృతిక వైభవం భావితరాలకు మరింత స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు.

జెడ్పీ సీఈఓ విచారణలో నిజం లేదు

మే 13న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో తలమడుగు మండలం కజ్జర్ల గ్రామంలో జరిగిన ఎన్నికల కోడ్ ఉల్లంఘనలో జెడ్పీ సీఈఓ విచారణ నివేదిక అవాస్తవంగా, సత్య దూరంగా ఉందని ధర్మసమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అగ్గిమల్ల గణేష్ మహారాజ్ అన్నారు. సోమవారం కలెక్టర్‌ను కలిసి పునర్విచారణ జరపాలని వినతిపత్రాన్ని అందజేశారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘణ విషయంలో విచారణ అధికారిగా జెడ్పీ సీఈవో జరిపిన విచారణలో నిజం లేదని, క్షేత్ర స్థాయిలో పర్యటించకుండా సత్యదూరమైన నివేదికను అందించారని తెలిపారు. అనుకోకుండా, తెలియకుండా జరిగిన సంఘటనగా పేర్కొనడాన్ని తప్పుబడుతున్నట్లు పేర్కొన్నారు. పోలింగ్ బూత్‌లో బీఆర్ఎస్ నాయకులతో భోజనాలు చేస్తూ ప్రభుత్వ నిబంధనలపై, ప్రజాస్వామ్యంపై భయం లేకుండా వ్యవహరించిన ఇలాంటి అధికారుపై చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ నాయకురాలు మెస్రం గంగాదేవి, గొంటిముక్కుల ఓమన్న, దుమ్మ తిరుపతి, తొంటికూరి సంతోష్, బండారి సంతోష్, అగ్గిమల్ల గంగన్న పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో అద్దె బస్సు డ్రైవర్ల నిరసన



నవతెలంగాణ-ఆసిఫాబాద్

తమ సమస్యలు పరిష్కరించాలని ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్లు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని డిపో ఆవరణలో సంఘం ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ నేతృత్వంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉపేందర్ మాట్లాడుతూ అద్దె బస్సు డ్రైవర్లను శ్రమ దోపిడీకి గురి చేస్తున్నారన్నారు. డిమాండ్లు పరిష్కరించకుంటే ఈ నెల 14 తర్వాత ఏ రోజు నుంచైనా నిరవధిక సమ్మెలోకి వెళ్తామని తెలిపారు. కనీస వేతనం రూ.32,000, ఈఎస్ఐ, పిఎఫ్, బోనస్ తదితర సౌకర్యాలు కల్పించాలని కోరారు. డిపోలో సుమారుగా 15 సంవత్సరాల నుంచి పనిచేస్తూ చాలీచాలని వేతనాలు తీసుకుంటూ డిపో అభివృద్ధిలో పాలుపంచుకుంటున్నప్పటికీ డ్రైవర్ల పరిస్థితి అధ్వానంగా ఉందన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి, అద్దె బస్ డ్రైవర్లను కూడా ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. సమాన పనికి సమాన వేతనం కల్పించాలని డిమాండ్ చేశారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించకుంటే 14 తర్వాత ఎప్పుడైనా సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు పిడుగు శంకర్, ఆర్టీసీ ప్రైవేట్ బస్ డ్రైవర్స్ యూనియన్ డిపో అధ్యక్షుడు మధుసూదన్, ఉపాధ్యక్షుడు అయిల్లా భాస్కర్, జాయింట్ సెక్రటరీ తేజ, విజయ్, కోశాధికారి సాయి కృష్ణ, కార్మికులు ఆత్మకూరి సంతోష్, తిరుపతి, షకీర్, రషద్, దశరథం పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
మంగళవారం | జూన్ 11, 2024 | www.navatelangana.com

విత్తనాల కొనుగోలుపై జాగ్రత్త వహించాలి

నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని లక్షెటిపేట గ్రామంలో సోమవారం వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఈఓ రవీందర్ మాట్లాడుతూ విత్తనాలు కొనే సమయంలో రైతులు జాగ్రత్తలు వహించాలని, విత్తనాలు కొన్నాక తప్పనిసరిగా రశీదులు తీసుకోవాలన్నారు. దళారులను



నమ్మి మోసపోకుండా వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన దుకాణాల్లో విత్తనాలు కొనుగోలు, ఏదైనా సమస్యలు ఉంటే తమను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు ఉన్నారు.

గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గిరిజన సంక్షేమ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ వెంటనే ప్రకటించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షప్రధాన కార్యదర్శులు ఎ.స్వామి, వి.అశోక్‌లు, జిల్లా కార్యదర్శి ఆత్రం ఇస్తారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్టు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల ఉపాధ్యాయులకు సంబంధించిన బదిలీల షెడ్యూల్ ప్రకటించినందుకు ప్రభుత్వానికి వారు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్టు పేర్కొన్నారు. గిరిజన సంక్షేమ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు కూడా అనేక సంవత్సరాలుగా బదిలీలు, పదోన్నతులు లేక ఆందోళనలో ఉన్నారని తెలిపారు. వారి బదిలీల కోసం వెంటనే షెడ్యూల్ ప్రకటించి, అమలు చేయాలని పేర్కొన్నారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభం అవుతున్న సందర్భంగా ఉపాధ్యాయుల బదిలీలు పదోన్నతులు పూర్తి చేయడం వలన ఉపాధ్యాయుల్లో నూతనోత్తేజం పెంపొంది, నాణ్యమైన విద్య అందించడానికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

గిరిజనుల సమస్యలు పరిష్కారం చేయాలి



నవతెలంగాణ-ఉట్నూర్

గిరిజనుల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బు గుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యల అర్జీలను ఆమె స్వీకరించారు. ఉట్నూర్ మండలం లక్కారం గ్రామానికి చెందిన గంగాదేవి తనకి ఏదైనా ఉపాధి కలిపించామని, నేరడిగొండ మండలం నాగమల్యాల్ గ్రామానికి చెందిన ఆత్రం జంగుబాయి తనకి అటవీహక్కు పత్రం ఇప్పించామని, పెంబి మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన పద్మ తనకి గురుకుల పాఠశాల అడ్మిషన్స్ కావాలని, ఉట్నూర్ మండలం హనుమాన్ నగర్ గ్రామానికి చెందిన నితిన్ తనకి ఆర్థిక సాయం కావాలని కోరారు. పింఛన్, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని ప్రజలు దరఖాస్తులు అందజేశారు. సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని పీఓ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ ప్రజావాణిలో అదనపు వైద్యాధికారి కుంరం బాలు, ఆర్‌సీఓ గంగాధర్, ఎఓ రాంబాబు, ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్, డీపీఓ ప్రవీణ్, మేనేజర్ లింగు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రారంభమైన నిత్యాన్నదాన కార్యక్రమం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా విధించిన కోడ్ వలన ప్రజాసేవ భవన్‌లో జరిగే నిత్యాన్నదానం కొద్ది రోజుల పాటు నిలిచి పోయింది. కోడ్ ఎత్తేయగానే తిరిగి సోమవారం కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. రిమ్స్ కొచ్చేవారు, జిల్లా కేంద్రానికి ఏదైనా పని మీద వచ్చేవారు, రోజూవారి కూలీలు, పేదలు.. ఎవరొచ్చినా తన క్యాంపు కార్యాలయంలో మధ్యాహ్నం ఆకలి వేళ కడుపునిండా అన్నం దొరుకుతుందని తెలిపారు. ఈ విషయాన్ని గమనించి, ఉచిత నిత్యాన్నదాన కేంద్రానికి వచ్చి తమ ఆకలి తీర్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మెన్ జహీర్ రంజాని, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్, లోక ప్రవీణ్‌రెడ్డి, కౌన్సిలర్లు కలాల శ్రీనివాస్, ఆవుల వెంకన్న, సాయి ప్రణయ్, దర్శనాల లక్ష్మణ్, ఆనంద్, జాఫర్ అహ్మద్, రామేశ్వర్, రషీద్ ఉల్ హాక్, నాయకులు బండి దేవిదాస్ చారి, పోరెడ్డి కిషన్, ఎంఏ షకీల్, రఫీక్ ఉన్నారు.

ఎస్సారెస్పీ భూములు దున్నుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-లోకేశ్వరం

ఎస్సారెస్పీ ప్రాజెక్టు భూసేకరణలో భాగంగా భూములు కోల్పోయిన రైతులు తిరిగి ఆ భూములను కబ్జా చేసి, దున్నుతున్నారని ఆరోపిస్తూ గడ్‌చాంద రైతులు సోమవారం మండలంలో తహసీల్దార్ మోతీరాంకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గడ్‌చాంద గ్రామ పాత ఊరులో ఎస్సారెస్పీ భూములను అక్రమంగా కొందరు దున్నుకుంటున్నారని మరికొందరు ఫెన్సింగ్ వేసి మత్స్యకారులకు, పశువులకు కాపారులకు, వినోదం కోసం వెళ్లే వ్యక్తులకు, గోదావరినది స్నానానికి వెళ్లే భక్తులకు ఇబ్బంది కలిగిస్తున్నారని తెలిపారు. ఎస్సారెస్పీ పట్టా భూములను అక్రమంగా ఆక్రమించుకున్నా భూములను పరిశీలించి కాపాడాలని గ్రామస్తులు కోరారు.

మినీ గురుకుల మిగులు సీట్లు భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ఉట్నూర్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నాలుగు మినీ బాలికల గురుకుల పాఠశాలలో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు చేసుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బు గుప్తా సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మినీ గురుకుల లోకారి, నేరడిగొండ, బేల, మామడలో 2024-25 విద్య సంవత్సరానికి ఒకటవ తరగతిలో ఆంగ్ల మాధ్యమంలో ప్రవేశం పొందుటకు, అలాగే మిగులు సీట్లు భర్తీకి 3, 4, 5వ తరగతిలో గిరిజన బాలికలచే దరఖాస్తులు కోరుతున్నట్టు తెలిపారు. అభ్యర్థులు లోకల్ మండలానికి చెందిన గిరిజన బాలికలకు అవకాశం ఉంటుందని, అర్హత గల గిరిజన బాలికలు ఆయా పాఠశాలకు వెళ్లి మీ దరఖాస్తు ఫారాలను జూన్ 18 తేదీ లోపు ఇవ్వాలని, మిగితా వివరాల కొరకు ఆయా పాఠశాల సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.

సొసైటీలో అందుబాటులో సోయాబీన్ విత్తనాలు

నవతెలంగాణ-తాంసి

మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో రైతులకు అవసరమైన సోయాబీన్ జేఎస్ 9305. ఎంఏయుఎస్ 612 గల రకం 30 కేజీల బస్తా ధర రూ.2,525 విత్తనాలు అందుబాటులో ఉన్నాయని సొసైటీ సీఈఓ కేశవ్ తెలిపారు. తాంసి మండల పరిధిలోని విత్తనాలు కావాల్సిన రైతులు పట్టా పాస్‌బుక్ ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకొని రావాలని అన్నారు.

బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలి

- ప్రధానోపాధ్యాయులు సత్యవాన్ చిక్టే



నవతెలంగాణ-జైనథ్

బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కాన్పమేడిగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యవాన్ చిక్టే అన్నారు. సోమవారం మండలంలోని కాన్పమేడిగూడ రోడ్ గ్రామంలో బడిబాటలో భాగంగా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బేటి బాచావ్ బేటి పడావ్, బాలికలను రక్షిద్దాం బాలికలను చదివిద్దాం అనే నినాదాలతో మేడిగూడ రోడ్ గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యవాన్ చిక్టే మాట్లాడుతూ బేటి బాచావ్ బేటి పడావ్ అనే నినాదంతో ప్రజల్లో చైతన్యం నింపాలని అన్నారు. బాలికలు జ్ఞాన చైతన్య దీపికలు అని అన్నారు. బడీడు పిల్లలు తప్పకుండా ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని గ్రామస్తులను కోరారు. బాలికలను చిన్నప్పటి నుంచి ఎలాంటి వివక్షతను చూపరాదని, మంచి చెడులను పిల్లలకు చెప్పాలనీ అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంతోష్, పవన్, భవాని ఆనంద్, పెంటపర్తి ఊశన్న, వీడీసీ చైర్మెన్ క్యాతం రాంరెడ్డి, రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా నాయకులు క్యాతం శివప్రసాద్ రెడ్డి, మహిళా సాధికారత కేంద్రం ప్రతినిధులు కొటేష్, నిఖీల్, అంగన్‌వాడీ టీచర్స్ కళావతి, స్వప్న, గంగాదేవి, గ్రామస్తులు సంతోష్ పాల్గొన్నారు.

ఉట్నూర్ : మండలంలోని శ్యామ్‌పూర్, చిన్నుగూడ, లక్షెట్టిపేట గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా తల్లిదండ్రులకు చదువుపై అవగాహన కల్పించారు. తప్పకుండా ప్రభుత్వ పాఠశాలలో తమ పిల్లలను చేర్పించాలని ఉపాధ్యాయులు జయేందర్ కోరారు. సోమవారం గ్రామం నుంచి కొంత మంది విద్యార్థులకు అడ్మిషన్‌లు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నారు.

నార్నూర్ : బడిబాటను విజయవంతం చేయాలని ఏంఈఓ ఆశన్న ఉపాధ్యాయులకు సూచించారు. సోమవారం ఉమ్మడి మండలంలోని అన్ని గ్రామాల్లోని పాఠశాలల్లో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయులు పోషకులతో అవగాహన కల్పించి, పాఠశాలలో విద్యార్థులకు ప్రవేశం కల్పించారు. పాఠశాలల్లో ప్రభుత్వం విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను వివరించి, ఈసారి విద్యార్థుల సంఖ్య పెరిగే విధంగా చూడాలని కోరారు.



ఉట్నూర్

ఏజెన్సీ చట్టాల సవరణ చేయాలి



నవతెలంగాణ -ఖానాపూర్

ఏజెన్సీ చట్టాలను సవరణ చేసి ఎస్సీ, ఎస్టీలకు న్యాయం చేయాలని ఎస్సీ, ఎస్టీ ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు గోళ్ల రాజమల్లు అన్నారు. ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ ఐక్యవేదిక జాతీయ అధ్యక్షులు దేవానంద్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు నాను సూచనల మేరకు ఖానాపూర్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే పంచాయతీరాజ్ ఎన్నికలలో ఏజెన్సీ ప్రాంతాలలో ఉన్నటువంటి పరిస్థితులపై ముఖ్యమంత్రి సమీక్ష జరిపి ఎస్సీ, ఎస్టీలకు తగు న్యాయం చేయాలని కోరారు. ముఖ్యమంత్రి కులగణన కార్యక్రమాన్ని స్వాగతిస్తూ కులగణన చేస్తున్న సందర్భంలో కులగణన ఆధారంగా మెజారిటీగా ఉన్న సామాజిక వర్గాల జనాభా ప్రాతిపదిక గ్రామపంచాయతీలో రిజర్వేషన్ కేటాయించాలన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఏజెన్సీ ప్రాంతాలలో గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఎస్సీ వార్డు సభ్యుల రిజర్వేషన్ కేటాయించారని, కానీ 2019 పంచాయతీరాజ్ ఎన్నికల్లో ఏజెన్సీ గ్రామ పంచాయతీలలో ఎస్సీ వార్డు సభ్యుల రిజర్వేషన్ తొలగించారాని అన్నారు. వెంటనే అట్టి ఏజెన్సీలో ఎస్సీ వార్డు సభ్యుల రిజర్వేషన్ మళ్లీ కేటాయించాలని అన్నారు. ఏజెన్సీ గ్రామ పంచాయతీలలో గిరిజనలు మొత్తం లేని గ్రామాలు చాలా ఉన్నాయనీ, అక్కడ పంచాయతీ ఎన్నికలు లేక అభివృద్ధికి నోచుకోలేకపోతున్నాయని అన్నారు. అలాంటి గ్రామాల్లో సర్పంచ్ రిజర్వేషన్ ఎస్సీలకే కేటాయించాలని, లేదా ఏజెన్సీని ఎత్తివేయాలన్నారు. రాష్ట్రంలో గ్రామపంచాయతీలలో గిరిజనులు 80 నుంచి 90శాతం ఉన్నా కూడా, అక్కడ అగ్రవర్ణాలు సర్పంచులుగా ఉండి గిరిజనులను అణిచివేతకు గురి చేస్తున్నారన్నారు. జనాభా ప్రతిపాదికన 80 నుంచి 90శాతం గిరిజనులు ఉన్న అలాంటి గ్రామాలకు ఏజెన్సీ చట్టాన్ని వర్తింపచేసి గిరిజనులకు న్యాయం జరిగేలా చేయాలని అన్నారు. ఈ సమావేశంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షులు బానావత్ గోవింద్, నందుర్క ముత్తయ్య, శ్రీనివాస్, గంగాధర్ పాల్గొన్నారు.

జడ్జితో సమగ్ర విచారణ జరపాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వైద్య కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ యూజీ ఫలితాల అవకతవకలపై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపి దోషులపై చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మెస్రం భాస్కర్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని సంఘం కార్యాలయంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఈ నెల 4న నీట్ 2024 ఫలితాలను ప్రకటించిందని, అయితే ఈ ఫలితాలలో 67 మంది విద్యార్థులు 720కి 720 మార్కులు పొందారని, ఇంత పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఎలా అగ్రస్థానంలో నిలిచారనే దానిపై వివాదం నెలకొందని అన్నారు. హర్యానాలోని పరీక్షా కేంద్రంలో ఒకే గదిలో పరీక్ష రాసిన విద్యార్థుల్లో పక్కపక్కనే కూర్చున్న వారిలో 8 మంది విద్యార్థులకు 720కి 720 మార్కులు రావడం ఈ పరీక్షలో ప్రశ్నాపత్రం లీక్ అయ్యిందా..? లేక మాస్ కాపీయింగ్ జరిగిందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. కొంతమంది విద్యార్థులకు గ్రేస్ ఇచ్చామని చెబుతున్న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఏ ప్రాతిపదికన గ్రేస్ మార్కులు ఇచ్చారో



చెప్పకపోవడం పట్ల విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ వివాదంపై తాజాగా ఎన్టీఏ వివరణ ఇచ్చిందని, కొన్ని కేంద్రాల్లో పరీక్ష నిర్వహణలో జాప్యం జరిగిందని, వారికి కలిగిన నష్టాన్ని భర్తీ చేయడం కోసం గ్రేస్ మార్కులు ఇవ్వడం అభ్యర్థులు హైకోర్టుల్లో పిటిషన్లు దాఖలు చేశారని, వారికి కలిగిన నష్టాన్ని భర్తీ చేయడం కోసం గ్రేస్ మార్కులు ఇవ్వడం జరిగిందని, డైరెక్టర్ చెప్పడం సిగ్గు చేటు అన్నారు. ఫలితాలను కూడా పది రోజులు ముందుకు జరిపి జూన్ 4కే ఆగమాగంగా విడుదల చేశారు. ఎలక్షన్ రిజల్ట్ వచ్చిన రోజే ఈ ఫలితాలను విడుదల చేయాల్సిన అవసరం ఎందుకొచ్చిందో తెలియడం లేదన్నారు. విద్యార్థులకు న్యాయం జరిగేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. కార్యక్రమంలో జిల్లా నాయకులు మెస్రం హరీష్, భీమ్ రావు పాల్గొన్నారు

పాఠశాలకు వెళ్లేందుకు బస్సు సౌకర్యం కల్పించాలి



నవతెలంగాణ-కుభీర్

పాఠశాలకు వెళ్లేందుకు సమయానికి బస్సు సౌకర్యం లేకపోవడంతోనే విద్యార్థులు పాఠశాలకు వెళ్లడం లేదని, ఇంటివద్దనే ఉంటున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. రాకుండా ఇంటి వద్దనే ఉండిపోతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపారు. సోమవారం మండలంలోని విరేగాం, మర్లగొండ, పార్డి(బి) ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు బడిబాటలో భాగంగా సోమవారం మండలంలోని విరేగాం, మర్లగొండ గ్రామాల్లో విద్యార్థుల ఇంటి ఇంటికి వెళ్లి బడికి రాని విద్యార్థులకు బడిలోకి రావాలని తల్లిదండ్రులకు సూచించారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు మా పిల్లలు బడికి రావాలంటే సమయానికి బస్సు సౌకర్యం లేకపోవడంతోనే చదువులు మానేస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా పార్డి(బి) పాఠశాల ప్రధానోపాధ్యాయులు నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు అన్ని రకాల సదుపాయాలను కల్పించడం జరుగుతుందని తెలిపారు. వారికి ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్‌లు, మధ్యాహ్న భోజనం, ఉచిత విద్యను అందించేలా అన్ని రకాల వసతులను ఏర్పాటు చేసి, ప్రత్యేక తరగతులకు కృషి చేస్తామని అన్నారు. పాఠశాల వేళల్లో బస్సు నడుపే విధంగా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు ఉన్నారు.

ఇంటింటి సర్వేను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-ఇచ్చోడ

ప్రతి గ్రామంలో ఇంటింటికి మిషన్ భగీరథ నల్లాలపై సర్వేను విజయవంతం చేయాలని ఎంపీడీఓ లక్ష్మణ్ అన్నారు. సోమవారం మండలంలోని 32 గ్రామపంచాయతీలలో కార్యదర్శులు ఇంటింటికి సర్వేను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ లక్ష్మణ్ మాట్లాడుతూ మండలంలోని 32 గ్రామపంచాయతీలలో 10,135 ఇండ్లు ఉండగా సోమవారం మొదటి రోజు 580 ఇండ్లకు వెళ్లి మిషన్ భగీరథ ద్వారా ఇంటికి నల్ల కనెక్షన్ ఇచ్చారా, లేదా నల్ల కనెక్షన్ ఉన్న ఇంట్లో ఎన్ని కుటుంబాలు ఉన్నాయి. ఎంతమంది నివాసం ఉంటున్నారు. నల్ల ద్వారా ఎంత మేర వాటర్ వస్తుంది, ఎంతసేపు వస్తుంది. అదనంగా నీటి అవసరం ఉందా అని కుటుంబ సభ్యులను అడిగి నల్లా ఫోటో, ఇంటి ఫోటో యాప్‌లో డౌన్లోడ్ చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ సాయిప్రసాద్, ఈఓ సూర్యప్రకాష్, కార్యదర్శులు పాల్గొన్నారు.

భీంపూర్ ఎస్సైగా మహమ్మద్ ఖలీల్



నవతెలంగాణ-తాంసి

భీంపూర్ పోలీస్ స్టేషన్ నూతన ఎస్సైగా మహమ్మద్ ఖలీల్ బాధ్యతలు చేపట్టారు. సోమవారం నూతన ఎస్సైని సీపీఐ(ఎం) మండల కన్వీనర్ స్వామితో పాటు పోలీస్ స్టేషన్ సిబ్బంది శాలువాతో సన్మానించారు. గతంలో ఇక్కడ ఎస్‌హెచ్‌ఓగా పనిచేసిన ఎస్సై ప్రదీప్ కుమార్ జిల్లా కేంద్రానికి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల్లో అందరూ సహరించాలని అన్నారు. మత్తు పదార్థాలుకు అందరూ దూరంగా ఉండాలని కోరారు. మండల ప్రజలు అన్ని సమయాల్లో పోలీస్ స్టేషన్‌కు రావచ్చని, మేము మీకోసమే ఉన్నామని అందరూ గ్రహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు గోవర్ధన్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

బడి బయట పిల్లలను గుర్తించిన సీఆర్పీలు



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో సోమవారం ఆదిలాబాద్ అర్బన్, మండలం పరిధిలోని భగత్‌సింగ్ నగర్‌లో బడి బయట పిల్లలను గుర్తించి, వారి సమాచారం సేకరించామని తెలిపారు. ఆదిలాబాద్‌లోని భగత్‌సింగ్ నగర్‌లో నూతన పాఠశాల ఏర్పాటు చేయడానికి అవసరమైన సమాచారాన్ని సేకరించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ అర్బన్, మావల, గ్రామీణ మండలాల సీఆర్పీలు తేజశ్రీ, అశ్వక్, దేవదర్శన్, రాజేశ్వర్, విజయ్, భాను ప్రకాష్, శంకర్, జావిద్, మునీర్ పాల్గొన్నారు.

బొజ్జన్న బువ్వ పున : ప్రారంభం

నవతెలంగాణ-ఉట్నూర్

ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆధ్వర్యంలో పేదల ఆకలి తీర్చేందుకు తలపెట్టిన బొజ్జన్న బువ్వ అన్నదాన కార్యక్రమం ఎన్నికల కోడ్ ముగిసిన నేపథ్యంలో సోమవారం నుంచి మళ్లీ పున : ప్రారంభించడం జరిగిందని, ప్రజలు ఈ బొజ్జన్న బువ్వ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

'ప్రభుత్వ బోరును వాడుకుంటున్నారు'

నవతెలంగాణ-ఖానాపూర్

ప్రభుత్వం ఏర్పాటు చేసిన మంచినీటి బోరు కొందరు తమ సొంత పనులకు వాడుకుంటున్నారని సోమవారం గ్రామస్తులు జైహింద్, నరేష్, మోహన్, దేవిచంద్‌లు సోమవారం ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్లి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సీనియర్ అసిస్టెంట్ స్వామికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ఖానాపూర్ మండలంలోని ఇక్బాల్‌పూర్ గ్రామంలో కొందరు ప్రభుత్వ బోర్వెల్‌ను ధ్వంసం చేసి తమ సొంతానికి వాడుకుంటున్నారని గ్రామంలో తాగునీటికి ఇబ్బంది పడుతున్నామని బోర్ ఉన్నప్పటికీ తాము వినియోగించుకోలేకపోతున్నామని, కొందరు తమ సొంత బోరుగా వాడుకుంటున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రభుత్వ బోరు అందరికీ ఉపయోగపడే విధంగా చూడాలని, తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు.

ప్రమాదకర విద్యుత్ వైర్ల మరమ్మతులు

నవతెలంగాణ-తాంసి



వ్యవసాయ పంట పొలాల మోటర్లకు సరఫరా అవుతున్న విద్యుత్ వైర్లు, స్తంభాలను సోమవారం విద్యుత్‌శాఖ అధికారులు పరిశీలించి, మరమ్మతులు చేపట్టారు. పంట పొలాల్లో లూజుగా ఉన్న వైర్లు సరి చేయటంతో పాటు ప్రమాదకరంగా వంగిన విద్యుత్ స్తంభాల స్థానంలో నూతన విద్యుత్ స్తంభాలను అమర్చారు. ఇప్పటివరకు 19 నూతన స్తంభాలను అమర్చినట్టు విద్యుత్‌శాఖ అధికారులు తెలిపారు. ఇంకా ఎక్కడైనా ప్రమాదకరంగా ఉన్న స్తంభాలు వైర్లు ఉన్నట్టు రైతులు మా దృష్టికి తీసుకువస్తే వాటిని కూడా సరి చేయడం జరుగుతుందని తెలిపారు. వర్షాకాలం దృష్ట్యా వైర్ల కింద ఉన్న చెట్లను తొలగించడం జరుగుతుందన్నారు. జేఎల్ఎం సంజీవ్‌తో పాటు విద్యుత్ సిబ్బంది పర్యవేక్షించారు.

సర్‌సిల్క్ పాఠశాలలో బడిబాట కార్యక్రమం

నవతెలంగాణ-కాగజ్‌నగర్



పట్టణంలోని సర్‌సిల్క్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం దేవాజీ మాట్లాడుతూ బడీడు పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించాలని, ప్రభుత్వ బడుల్లో పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫాం, విహారయాత్ర ఉచితంగా అందజేయడం జరుగుతుందన్నారు. వీటితో పాటు మధ్యాహ్న భోజనం కూడా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవికుమార్, భాస్కర్, సుధాకర్, సీహెచ్ స్వామి, రాంప్రసాద్, దామోదర్, నీరజ, సీఆర్పీ మధూకర్ పాల్గొన్నారు.

జిల్లావాసికి జ్యోతిబాపూలే జాతీయ అవార్డు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో పూణేలో సోమవారం నిర్వహించిన వేడుకల్లో జిల్లావాసి, బీసీ సంక్షేమ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఆవిడపు ప్రణయ్ మహాత్మ జ్యోతిబాపూలే జాతీయ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ అతి చిన్న వయసులో ప్రణయ్ చేసిన సేవలకు అవార్డు ఇవ్వడం సంతోషంగా ఉందని తెలిపారు. ప్రణయ్ మాట్లాడుతూ తన సేవలని గుర్తించి అవార్డు ప్రధానం చేసినందుకు బహుజన సాహిత్య అకాడమీ వారికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు ఆవిడపు ప్రణయ్‌కి శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేసి పలువురు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బహుజన సాహిత్య అకాడమీ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రాంబాబు, బాదే వెంకటేశం పాల్గొన్నారు.

జిల్లాలో ప్రారంభమైన ప్రజావాణి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

84 రోజులుగా ఎన్నికల కోడ్ నేపథ్యంలో రద్దైన ప్రజావాణి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం తిరిగి ప్రారంభమైంది. అదనపు కలెక్టర్ దాసరి వేణు అర్జీదారుల వద్ద నుండి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల పరిశీలనతో పాటు పరిష్కారం కోసం అధికారులు కృషి చేయాలన్నారు. అప్పుడే ప్రజలకు అధికారంపై నమ్మకం పెరుగుతుందన్నారు. స్థానికంగా మండల వారీగా సమస్యలు పరిష్కరించే దిశగా మండల స్థాయి అధికారులు ప్రయత్నం చేయాలని సూచించారు. అప్పుడే జిల్లా కేంద్రానికి వచ్చే వారి సంఖ్య తగ్గుతుందని తెలిపారు. కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

నీటి సరఫరాపై ఇంటింటా సర్వే నిర్వహించాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

మిషన్ భగీరథ నీటి సరఫరాలో కొన్ని చోట్ల అంతరాయం ఏర్పడుతున్న నేపథ్యంలో ఈ సమస్యను పరిష్కరించే పనుల్లో భాగంగా ఇంటింటా సర్వే నిర్వహించాలని డీఎల్పీఓ సురేష్ బాబు సూచించారు. సోమవారం వంజీరి రైతు వేదిక భవనంలో మిషన్ భగీరథ నీటి సరఫరాపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుళాయిల వివరాలను నమోదు చేసి ఎక్కడైతే సమస్య ఉంటుందో వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు, ఐకేపీ సిబ్బందికి సమస్యపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓలు రమేష్, అల్బర్ట్, రాజేందర్, గంగాసింగ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

జేఈఈలో మెరిసిన పీటీజీ విద్యార్థి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జేఈఈ అడ్వాన్స్ ఎస్టీ కేటగిరీలో జిల్లాలోని పీటీజీ కళాశాలలో చదివిన భానోత్ తరుణ్ 652 ర్యాంకు సాధించి ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సురేష్ వివరాలు తెలుపుతూ కౌటాల మండలం లంబాడిహెట్టి గ్రామానికి చెందిన వల్యానాయక్, సాలిభాయ్ దంపతుల కుమారుడు బానోత్ కిరణ్ ఇంటర్మీడియట్ పూర్తి చేసి గత సంవత్సరం ఐఐటీలో అనుకున్న ర్యాంకు రాలేదు. దీంతో గిరిజన గురుకుల సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో నిర్వహిస్తున్న లాంగ్ టర్మ్ కోచింగ్ సెంటర్‌లో కోచింగ్ తీసుకున్నాడు. తాజాగా ప్రకటించిన ఫలితాల్లో ఎస్టీ కేటగిరీలో 652 ర్యాంకు సాధించడం తమ కళాశాలకు గర్వకారణం అని తెలిపారు. దీనితో విద్యార్థి ఐఐటీకి ఎంపిక కానున్నట్లు వివరించారు. ఇతర విద్యార్థులకు ఆదర్శప్రాయంగా నిలిచిన తరుణ్‌ను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సమన్వయకర్త గంగాధర్‌తో పాటు అధ్యాపకులు అభినందించారు. కుమారుడు ఉత్తమ ర్యాంకు సాధించడంతో తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.

భూ నిర్వాసితులకు పని చేసుకునే అవకాశం కల్పించాలి



నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియాలోని భూ నిర్వాసితులకు అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ పనులలో పని చేసుకునే అవకాశం కల్పించాలని హెచ్‌ఎంఎస్ యూనియన్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు రాజబాబు కోరారు. సోమవారం బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ రవి ప్రసాద్‌కు వినతిపత్రం అందించి సమస్యలను విన్నవించారు. బెల్లంపల్లి ఏరియాలో ఓసీపీ విస్తరణలో భాగంగా భూములు కోల్పోయిన వారితో పాటు ఇక్కడ నివసిస్తున్న వారికి అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగాలు కల్పిమని యాజమన్యం చెప్పిందన్నారు. జీవన ఆధారమైన భూములను కోల్పోయిన నిర్వాసితులకు యాజమన్యం హామీ మేరకు ఉద్యోగాలివ్వాలని కోరారు. కార్యక్రమంలో కాంట్రాక్టు కార్మిక సంఘం గోలేటి సీహెచ్‌పీ హెచ్‌ఎంఎస్ ఏరియా నాయకురాలు శంకరమ్మ, తులసీరాం, లక్ష్మణ్, పార్వతి, నాగరాణి, రాజేశ్వరి పాల్గొన్నారు.

కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్
- అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం



అదనపు కలెక్టర్ దీపక్ తివారికి వినతిపత్రం అందిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని గ్రామపంచాయితీల్లో సుమారుగా 6 నెలల నుండి వేతనాలు లేక కార్మికులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పెండింగులో ఉన్న వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అడిషనల్ కలెక్టర్ దీపక్ తివారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 2023 జులై, ఆగస్టు నెలలో కార్మికుల వేతనాలు ఇతర సమస్యల పరిష్కారం కోసం 34 రోజుల పాటు నిరవధిక సమ్మె చేయటం జరిగిందన్నారు. అప్పటి రాష్ట్ర ప్రభుత్వం కార్మిక సంఘాలన్నింటిని చర్చలకు పిలిచి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇవ్వటంతో నాడు సమ్మె విరమించామని తెలిపారు. కార్మికులందరికి జీవిత బీమా సౌకర్యం రూ. 5 లక్షలు కల్పిస్తామని ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. కానీ నేటికి అనేక జిల్లాల్లో జీవిత బీమా సౌకర్యం కల్పించకపోవటంతో జిల్లాల్లోని అనేక ప్రాంతాల్లో ట్రాక్టర్, ఇతర ప్రమాదాల్లో మరణించిన కార్మికులకు ఇన్సూరెన్స్ సౌకర్యం వర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులందరికీ కనీస వేతనం రూ.19000 చెల్లించాలని డిమాండ్ చేశారు. జీఓ నెంబర్ 51 సవరించి మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించడంతో పాటు ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా కార్యదర్శి దుర్గం వెంకటేష్, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆత్మకూరి చిరంజీవి, కార్మికులు ధర్మయ్య, మల్లయ్య, లక్ష్మణ్, వెంకటేష్, సంతోష్, శంకర్, గోపాల్, అంజయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆదేశాలను ధిక్కరిస్తున్న అధికారులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కార్తీక్

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

జిల్లాలో కొన్ని గురుకులాలలో రిటైర్మెంటైన ఉద్యోగులు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులుగా కొనసాగుతున్నారని, ప్రభుత్వ ఆదేశాలకు వ్యతిరేకంగా వ్యవహిస్తున్న అధికారులు పట్టించుకోవడం లేదని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్ ఆరోపించారు. సోమవారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గతంలో రిటైర్మెంటైనా ప్రభుత్వ శాఖల్లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులుగా కొనసాగుతున్నారు. అలాంటి వారిని తొలగించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. ముఖ్యంగా జిల్లాలో మైనార్టీ గురుకుల పాఠశాలలో కాగజ్‌నగర్ బ్లాక్ 1, బ్లాక్ 2లో రిటైర్మెంటైనా ఉద్యోగులు కొనసాగుతున్నారని తెలిపారు. ఈ విషయంపై గతంలో ఎన్నో సందర్భాల్లో డివైఎఫ్ఐగా ఇతర ప్రజాసంఘాలను కలుపుకొని కలెక్టర్‌కు వినతిపత్రాలు ఇచ్చినప్పటికీ ఈ విషయంపై స్పందించి జిల్లా కలెక్టర్ మైనారిటీ గురుకుల రాష్ట్ర కార్యదర్శికి లేఖ రాసిన స్పందన లేకుండా పోయిందన్నారు. తిరిగి పాఠశాల ప్రారంభమైనప్పటికీ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను తొలగించడంలో మైనార్టీ గురుకుల కార్యదర్శి పూర్తిగా బాధ్యత రహితంగా పనిచేస్తున్నారని ఆరోపించారు. ఫిబ్రవరి నెలలో రెగ్యులర్ వాళ్లని కేటాయించాలని, నోట్ అప్రూవల్ కలెక్టర్ ఇచ్చిన దాన్ని పూర్తిగా ధిక్కరిస్తున్నారన్నారు. అటు ప్రభుత్వ మాట ఇటు జిల్లా కలెక్టర్ మాట పూర్తిగా ధిక్కరిస్తున్నారని, వెంటనే మైనారిటీ కమిషనర్, సెక్రెటరీ స్పందించి రిటైర్మెంట్ అయిన అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను తొలగించి రెగ్యులర్ వాళ్లకి పోస్టింగ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో విద్యార్థులను కలుపుకొని ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం నాయకురాలు కొరంగి మలశ్రీ, కేవీపీఎస్ నాయకులు రామయ్య పాల్గొన్నారు.

పశువుల అక్రమ రవాణా నిరోధానికి చర్యలు

- ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా, పక్కన అదనపు కలెక్టర్ శ్యామల దేవి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పశువుల అక్రమ రవాణాను నిరోధించేందుకు గట్టి నిఘా ఏర్పాటు చేయాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. బక్రీద్ వేడుకలను పురస్కరించుకుని సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జంతు సంక్షేమం, గోవధ నిషేధంపై జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువుల అక్రమ రవాణా నిరోధం, జంతు సంక్షేమ నియమాల అమలుపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షిస్తూ పలు సూచనలు చేశారు. జంతు సంక్షేమం కోసం ఉన్న చట్టాలు పక్కాగా అమలయ్యేలా చూడాలని, సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పని చేయాలన్నారు. గోవధ నిషేధ చట్టం ప్రకారం గోవధను నిషేధించినందున ప్రజలకు విస్తృతస్థాయిలో అవగాహన కల్పిస్తూ, ఎక్కడ కూడా గోవధ జరగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పశువుల అక్రమ రవాణాను నిరోధించేందుకు జిల్లాలోని చెక్ పోస్టులను వద్ద ప్రత్యేకంగా చెక్ పోస్టులు ఏర్పాటు చేయాలని, రెవెన్యూ, పోలీస్, రవాణా శాఖలకు చెందిన అధికారులు నిరంతరం నిఘా ఉండేలా పర్యవేక్షణ చేయాలన్నారు. నిబంధలు విరుద్ధంగా వివిధ వాహనాలలో పశువులను తరలిస్తే వెంటనే సీజ్ చేసి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. సీజ్ చేసిన పశువులకు స్థానికంగానే షెల్టర్ కల్పిస్తూ వాటికి పశుగ్రాసం, నీటి వసతి కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయంలో గోశాల నిర్వాహకుల సహకారం తీసుకోవాలన్నారు. పశువుల వారాంతపు సంతలలో నిబంధల అనుగుణంగా పశు సంరక్షణ చట్టానికి లోబడి క్రయవిక్రయాలు జరిగేలా చూడాలన్నారు. బక్రీద్ సందర్భంగా ఎక్కడబడితే అక్కడ పశువులను వధించకుండా కట్టడి చేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ సురేందర్ రావు, డిఎస్పీ జీవన్ రెడ్డి, ఆర్డీఓ జీవాకార్ రెడ్డి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి కిషన్, తహసీల్దార్లు, పంచాయితీ అధికారులు, పాల్గొన్నారు.

ప్లాస్టిక్ బాటిల్స్ వాడకం నిషేధించాలి

అంతకుముందు ప్లాస్టిక్ బాటిల్స్ వాడకం నిషేధంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయాలు, సమావేశ మందిరాలలో ఎక్కడ కూడా ప్లాస్టిక్ బాటిల్స్ వాడరాదని ఆదేశించారు. సింగిల్ యూస్ ప్లాస్టిక్ వాడకాన్ని ప్రభుత్వం నిషేధించినట్లు ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలలో ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించినట్లు తెలిపారు. ప్రతి కార్యాలయంలో ప్లాస్టిక్ నిషేధ ఆజ్ఞలు పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని హెచ్‌ఓడీలను ఆదేశించారు. అధికారిక కార్యక్రమాలు, సమావేశాలలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధ ఆజ్ఞలను అమలు చేయాలన్నారు.

బదిలీలు, పదోన్నతులను పారదర్శంగా నిర్వహించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను పారదర్శంగా నిర్వహించాలని టీయూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీకాంత్, జలంధర్ రెడ్డి కోరారు. సోమవారం డీఈఓ ప్రణీతను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీనియార్టీ జాబితాలో తప్పులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. బదిలీలు పదోన్నతుల ప్రక్రియ సాఫీగా జరిగేలా డీఈఓ కార్యాలయంలో గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేయాలని కోరారు. స్పౌస్ పాయింట్స్‌చే బదిలీలకు దరఖాస్తు చేసుకున్నావారు. వెబ్ ఆప్షన్స్ వారి స్పౌస్‌కు దగ్గర స్థానాల నుండి దూరం స్థానాలకు ఇచ్చుకునేటట్లుగా మార్గ నిర్దేశాలు జారీ చేయాలన్నారు. అర్హులైన వారికి అన్యాయం జరగకుండా చూడాలని కోరారు. ఉపాధ్యాయులకు ఇబ్బందులు లేకుండా విద్యాశాఖ తరఫున చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

దాహం తీర్చుకోడానికి వెళ్లి బావిలో పడ్డ ఎద్దు

నవతెలంగాణ-ఇంద్రవెల్లి



దాహం తీర్చుకోవడానికి వెళ్లి ఎద్దు బావిలో పడిన ఘటన మండలంలోని ఇంకర్ గూడలో జరిగింది. సోమవారం మండలంలోని ఇంకర్‌గూడకు చెందిన నారాయణ ఎద్దు పొలిమేరలో ఉన్న బావిలో దాహం తీర్చడానికి వెళ్లి ప్రమాదవశత్తు పడింది. దీన్ని గమనించిన శంకర్‌గూడ, ఇంకర్‌గూడ గ్రామస్థులు, యువకులు జాదవ్ విజయ్, మదినే బాలాజీతో మరికొంత యువకులతో కలిసి తాడు సాయంతో ఎద్దును బావి నుంచి బయటకు తీశారు. ఎద్దుకు పశువైద్య సిబ్బంది చికిత్సలు అందించారు.

ప్రమాదవశాత్తు మడుగులో పడి వ్యక్తి మృతి

నవతెలంగాణ-రెబ్బెన

మండలం దుర్గాపూర్ గ్రామ శివారు వాగులో ఉన్న మడుగులో ప్రమాదవశత్తు పడి ఒకరు మృతి చెందారు. ఎస్సై చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. నంబాల గ్రామానికి చెందిన టేకం శంకర్ (55) నాలుగు సంవత్సరాల నుండి నాందేవ్ అనే వ్యక్తి దగ్గర పాలేరుగా పనిచేస్తూ జీవిస్తున్నాడు. ప్రతిరోజు ఆవులు, ఎద్దులను తీసుకొని మేతకు వెళ్లడం తిరిగి రావడం చేస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం ఆవులు తీసుకొని గ్రామ సమీపంలో గల వాగు వద్దకు వెళ్లాడు. వాగు వద్ద ఉన్న మడుగులో ప్రమాదవశాత్తు పడిపోవడంతో అటువైపుగా వెళ్లిన దుర్గాపూర్ గ్రామస్తులు గమనించి యజమాని నందేవ్‌కు సమాచారం అందించారు. నాందేవ్ కుటుంబ సభ్యులకు సమాచారం అందించి మడుగు వద్దకు చేరుకోగా అప్పటికే 108 అంబులెన్స్ అక్కడికి వచ్చింది. మనుడు నుంచి శంకర్‌ను తీసి 108 అంబులెన్స్‌లో ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. టేకం శంకర్ కొడుకు టేకం విలాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.

మౌలిక సౌకర్యాలు కల్పించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇండ్లు నిర్మించుకునేందుకు విద్యుత్ సౌకర్యంతో పాటు ఇతర మౌలిక వసతుల తొందరగా పూర్తి చేసి సమస్యలు పరిష్కరించాలని రాజీవ్ స్వగృహ లబ్ధిదారులు అన్నారు. ఈ విషయమై సోమవారం కలెక్టర్ రాజార్షి షాను కలిసి వినతిపత్రం అందజేశారు. సమస్యలు త్వరితగతిన పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో ఇల్లు కట్టుకునే అవకాశం లేకపోవడంతో పాటుగా గృహ రుణాలు తీసుకున్న వారికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్ సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి పనులు జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. ఇందులో రాజీవ్ సగృహ అగ్రజా టౌన్షిప్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శులు కాంబ్లే విజయ్ కుమార్, జలంధర్ రెడ్డి, సభ్యులు రవీందర్, సంతోష్, నగేష్ రెడ్డి, కృష్ణమూర్తి, భరత్, స్వామి, మధుసూదన్ రెడ్డి, రాంజీ పాల్గొన్నారు.

కేంద్ర మంత్రులను కలిసిన ఎంపీ, ఎమ్మెల్యే



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కేంద్ర మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌లను ఆదిలాబాద్ ఎంపీ నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ అభినందనలు తెలిపారు. అలాగే బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎర్రాల నగేష్ కలిశారు. సోమవారం ఢిల్లీలో వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. వారి వెంట సిర్పూర్ ఎమ్మెల్యే హరీష్ బాబు, బీజేపీ రాష్ట్ర నాయకులు ప్రేమేందర్ రెడ్డి, అశోక్ నాయకులున్నారు.

బోథ్‌లో మహిళ అదృశ్యం

నవతెలంగాణ-బోథ్



మండల కేంద్రంలోని న్యూ కాలనీకి చెందిన మాల్వే చంద్రకళ అదృశమైనట్లు కేసు నమోదు చేశామని ఎస్సై రాము తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. న్యూ కాలనీకి చెందిన చంద్రకళ భర్త కూలీ పనికి వెళ్లగా ఆమె ఇంట్లోనే ఉంది. భర్త సాయంత్రం ఇంటికి రాగ ఆమె కనిపించకపోవడంతో బంధువుల ఇండ్లలో ఆరా తీశాడు. సమాచారం తెలియకపోవడంతో సోమవారం భర్త పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాము తెలిపారు.

ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని తెలంగాణ మోడల్ స్కూల్ గంటల ప్రతిపాదికన ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ నాగ మల్లయ్య తెలిపారు. ఎకనామిక్స్, కామర్స్ బోధించుటకు అనుభవం కలిగిన ఉపాధ్యాయులు కావాలని, పీజీటీ ఎకనామిక్స్ సబ్జెక్టు బోధించుటకు ఎంఏ ఎకనామిక్స్‌తో పాటు బీఈడీ కలిగి ఉండాలని, పీజీటీ కామర్స్ బోధించుటకు ఎంకామ్‌తో పాటు బీఈడీ కలిగి ఉండాలన్నారు. అనుభవం కలిగిన ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులకు ప్రాధాన్యం ఇవ్వబడునన్నారు. ఆసక్తిగల వారు 11వ తేది నుండి 13 వరకు కాసిపేట తెలంగాణ మోడల్ స్కూల్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

స్టాక్ రిజిస్టర్లను పరిశీలించిన వ్యవసాయ అధికారులు

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని పలు గ్రామాలలో ఉన్న విత్తనాల దుకాణాలను మండల వ్యవసాయ అధికారులు పరిశీలించారు. వానకాలం వ్యవసాయ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం చింతలపల్లి గ్రామంలోని పలు వ్యవసాయ విత్తన విక్రయ దుకాణాలను సందర్శించారు. యజమానులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఓ సంగీత, ఏఈఓ త్రిసంధ్య పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
మంగళవారం | జూన్ 11, 2024 | www.navatelangana.com

ఘనంగా శివాజీ మహారాజ్ విగ్రహావిష్కరణ

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని కామన్‌పల్లి గ్రామంలో శివాజీ సేన యూత్ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సోమవారం గ్రామ ప్రజలు, హిందూ పరిషత్ నాయకుల ఆధ్వర్యంలో విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం విగ్రహం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో శివాజీ సేనా యూత్ అధ్యక్షుడు రాఘంశెట్టి ప్రవీణ్, ఉపాధ్యక్షుడు కొత్తపల్లి నరేష్, సర్పంచ్ పేరం మానస శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆహ్లాదానికి కేరాఫ్ క్వారీ దుర్గమ్మ ఆలయం

- నీటి కొలనులు.. పక్షుల కిలకిల రావాలు క్వారీ సొంతం
- అలరిస్తున్న ప్రకృతి సోయగాలు
- క్వారీలో పర్యాటకుల సందడి

అది దట్టమైన అడవి ప్రాంతం చుట్టూ కొండలు కొండల నడుమ దారి. పక్షుల కిలకిల రావాలు. జంతువుల అరుపులు. కోతుల సందడి. పక్కన రోప్ వే నుండి తీగల ద్వారా బకెట్లలో సిమెంట్ రాయి వెళ్లడం క్వారీలోని నీటి కొలనులు అలాంటి సుందర ఆహ్లాద ప్రదేశంలో కొలువైంది దుర్గా మాతా ఆలయం. అమే భక్తుల పాలిట కొంగు బంగారం. ఇలా 52 ఏండ్ల క్రితం వెలిసిన క్వారీలోని దుర్గామాతా. ప్రతీ ఆశాడంలో ప్రత్యేక జాతర నిర్వహిస్తారు. ఎంసీసీ యాజమాన్యం.. సెలవు రోజుల్లో జిల్లా నలుమూలల నుండి పర్యాటకుల సందడితో క్వారీ ప్రదేశం కిక్కిరిసిపోతుంది.



నవతెలంగాణ-హాజీపూర్

మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం ఘడ్పుర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఒకప్పుడు ఏసీసీ క్వారీగా పిలువబడిన ఎంసీసీ క్వారీలో దుర్గామాత కొలువైంది. ఎత్తైన ప్రదేశం చుట్టూ గుట్టలు ఎంసీసీ పార్కులు నీటి కొలనులు ఇలా సుందరమైన ప్రశాంత వాతావరణంలో ఉన్న దుర్గాదేవి ఆలయానికి నిత్యం భక్తుల తాకిడి ఉంటుంది. గుట్ట కింద ఉన్న మంచిర్యాల పట్టణం నుండే కాకుండా పక్క రాష్ట్రాల నుండి చుట్టూ ప్రక్కల గ్రామాల నుండి భక్తులు దుర్గాదేవి ఆలయానికి వస్తుంటారు. ఇక్కడ ఎంసీసీ యాజమాన్యం భక్తుల సౌకర్యాలను దృష్టిలో పెట్టుకోని ఎప్పటికప్పుడు పారిశుధ్య, నీటి వసతి కల్పిస్తుంది. ముఖ్యంగా ఆది వారాల్లో అందరూ పిల్ల జల్లలతో క్వారీకి వెళ్లి అక్కడే వంట వార్పులు చేసుకోని రోజంతా అహ్లాదంగా గడుపుతారు. అక్కడ సెల్ ఫోన్ సిగ్నల్స్ కూడా అందవు. దీంతో ప్రశాంతతను కోరుకునే వారు అక్కడ సేదతీరుతారు. పక్కనే ఎంసీసీ యాజమాన్యం సిమెంట్ రాయి కోసం తీసిన లోతైన గుంతల్లో క్వారీ ఏర్పడి సుమారు 2 కిలోమీటర్ల పొడవు ఉండే క్వారీలో నీరు ఎల్లప్పుడూ అలలాడుతుంది. భక్తులను మరింత ఆహ్లాదానికి గురిచేస్తుంది. ఆ నీటి కొలనులు చుట్టూ కంపెనీ యాజమాన్యం పార్కులు నిర్మించింది. ఆ పార్కుల్లో సేద దీరుతూ లోకాన్ని మైమరిచిపోతుంటారు.

1971లో మొదలైన జాతర

52 ఏండ్ల క్రితం నుండి ఇక్కడ జాతర జరుగుతుంది. 1971లో ఆషాడ మాసంలో మొదలైన జాతరకు మొదట్లో ఎంసీసీ కార్మికులు మాత్రమే జరుపుకునే వారు. ఎంసీసీ కంపెనీ యాజమాన్యం అక్కడ కొలువైన దుర్గామాతకు ఆలయాన్ని నిర్మించింది. తర్వాత గుట్టపైన ఉన్న గిరిజన గ్రామాలైన ఘడ్పుర్, ర్యాలీ, నాగారం చిన్నగోపాల్ పూర్‌ల గిరిజనులు కూడా ఇక్కడ పూజలు చేయడం ఆనవాయితీగా మారింది. కాలక్రమేణా అన్ని వర్గాల వారు ఇక్కడికి రావడంతో విశేష ప్రాచుర్యం పొందింది. మంచిర్యాల సమీప గ్రామాలు కాకుండా పక్కనున్న పొరుగు రాష్ట్రాలైన ఆంధ్ర, మహారాష్ట్రల నుండే కాకుండా ఉమ్మడి జిల్లా, పొరుగు జిల్లాల నుండి భక్తులు ఈ జాతరకు వేల సంఖ్యలో వస్తుంటారు. దీంతో రెండు రోజుల పాటు జాతర ప్రాంతమంతా జనారణ్యాన్ని తలపిస్తుంది. ఇక్కడ భక్తులు వాహన పూజలు ఎక్కువ జరిపిస్తుంటారు. జాతర సమయంలో వందల సంఖ్యలో వాహనాలు పూజలకు వస్తుంటాయి. వాహనాలకు పూజలు చేసి మేకలు, కోళ్లను బలిచ్చి మొక్కులు తీర్చుకుంటారు. కుటుంబ సభ్యులు, బంధువులతో విందు ఏర్పాటు చేస్తుంటారు.

పర్యాటక ప్రాంతాల్లో మొదటి స్థానం

జిల్లాలో ఉన్న పర్యాటక ప్రాంతాల్లో ఎంసీసీ క్వారీ మొదట ఉంటుంది. దీనికి కారణం జిల్లా కేంద్రానికి దగ్గరగా ఉండడం ఒకటైతే ప్రకృతి అందాలు పర్యాటకులను మంత్రముగ్దులను చేస్తాయి. పిచ్చుకల రాగాలు, కోతుల సందడులు, ఆహ్లాద పరిచే నీటి కొలనులు, వంకలు తిరిగిన ఘాట్ రోడ్డు ప్రయాణం అందుకె కావచ్చు ఇక్కడ పర్యాటకుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. బర్త్ డే పార్టీలకు, ఉద్యోగ విరమణ పార్టీలకు నెలవు ఈ ఎంసీసీ క్వారీ. క్వారీ దాటి అవతలి గిరిజన గుడాలకు వెళ్తే అక్కడ గిరిజన ప్రజల జీవన శైలిని ప్రత్యేకంగా చూడొచ్చు. గుట్టపైన ర్యాలీ, ఘడ్పుర్, నాగారం, చిన్న గోపాల్పుర్ అనే నాలుగు గిరిజన గ్రామాల్లో ఉన్నాయి. వారు అడవుల్లో దొరికే వెదురు బొంగులతో బుట్టలు అల్లడం, గిరిజన తరహా వ్యవసాయం చేయడం చూడొచ్చు. జిల్లా కేంద్రానికి15 కిలోమీటర్ల దూరంలోనే ఉన్న కానీ గిరిజన గుడాలు మాత్రం అభివృద్ధికి ఆమడదురంలో ఉండడం ఇంకా అక్కడ పురాతన గిరిజన సాంప్రదాయాలు మనకు కనబడుతుంటాయి. ఎత్తైన గుట్టలపైన ప్రకృతిని నమ్ముకొని గిరిజనులు సాగు చేస్తున్న పంటలు వారి జీవన శైలిని చూడొచ్చని పర్యాటకులు వెళ్తుంటారు.







ఇసుక, భూదందాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదు

- ఆరు గ్యారంటీల అమలుకు కట్టుబడి ఉన్నాం
- చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి



నవతెలంగాణ-జైపూర్

తన పేరు చెప్పుకొని ఎవ్వరు ఇసుక, భూదందాలకు పాల్పడినా సహించేది లేదని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి హెచ్చరించారు. భీమారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెవెన్యూ పోలీస్ అధికారులు అక్రమదందాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం ద్వార రూ.10 లక్షలకు పెంచి వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చామని అన్నారు. కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాల అమలుకు ప్రభుత్వం కట్టుబడిఉందని తెలిపారు. గతంలో ఏ ప్రభుత్వం అమలు చేయనివిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించిందని అన్నారు. అర్హులైన వారందరికి ఇందిరమ్మ ఇండ్లు పంపిణీ చేస్తామని, ఎలక్షన్ కోడ్ కారణంగా అభివృద్ధి పనులు ఆగిపోయినట్లు తెలిపిన ఆయన ఇక నుండి అభివృద్ధి పనులు ముమ్మరం చేయడం జరుగుతుందని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా పాలన వచ్చిందని, ఆంధ్రప్రదేశ్‌లో అహంకారంగా వ్యవహరించిన జగన్, తెలంగాణాలో కేసీఆర్ ప్రభుత్వాలకు ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పారని విమ్మర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ తీసుకొచ్చిన మిషన్ భగీరథ అట్టర్‌ఫ్లాఫ్ అని పేర్కొన్నారు. కాళేశ్వరంలో రూ.లక్ష కోట్ల అవినీతి జరిగిందని, చెన్నూర్ నియోజకవర్గంలో వేసవి ఎండల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా అవసరాన్ని బట్టి బోర్లు వేయించామని అన్నారు. చెన్నూర్ ఎమ్మెల్యేగా నన్ను, పెద్దపల్లి పార్లమెంట్ నుండి నా కుమారుడు వంశీకృష్ణను గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే ప్రజలు కోరుకున్నట్లుగా అభివృద్ధి చేసి చూపిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హాస్టల్ వర్కర్స్‌కు జీఓ ప్రకారం వేతనాలు చెల్లించాలి



నవతెలంగాణ-నస్పూర్

మంచిర్యాల జిల్లాలోని 8 పోస్ట్ మెట్రిక్ హాస్టల్‌లో విధులు నిర్వహిస్తున్న సుమారు 50 మంది కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ వర్కర్స్‌కు జీఓ నెంబర్ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని ఐఎఫ్టీయూ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ రాహుల్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా భారత కార్మిక సంఘాల సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి(ఐఎఫ్టీయూ) డి బ్రహ్మానందం మాట్లాడుతూ షెడ్యూల్ క్యాస్ట్ డెవలప్మెంట్ డిపార్ట్మెంట్‌లో కొనసాగుతున్న ప్రీ మెట్రిక్ హాస్టల్ వర్కర్స్‌కు రాష్ట్ర ప్రభుత్వం జీఓ నెంబర్ 60 ప్రకారం కనీస వేతనాలు రూ.15600 వేతనాలు చెల్లిస్తున్నారని, ఈఎస్ఐ, ఈపీఎఫ్ అమలు చేస్తున్నారని, ఒకే శాఖకు చెందిన పోస్టు మెట్రిక్ హాస్టల్‌లో పనిచేసే ఔట్ సోర్సింగ్ వర్కర్స్‌కు కనీస వేతనాలు, ఈఎస్ఐ, ఈపీఎఫ్ లేదని మండిపడ్డారు. ప్రతి నెల వేతనాలు చెల్లించడం కూడా సరిగా చెల్లించడం లేదని, వేతనాలు ఎందుకు చెల్లించడం లేదని అధికారులను ప్రశ్నిస్తే బడ్జెట్ లేదంటు నిర్లక్ష్యపు సమాదానాలు చెపుతున్నారని ఆరోపించారు. నాలుగు నెలలు, ఐదు నెలలైనా వేతనాలు చెల్లించని దౌర్భాగ్య పరిస్థితి నెలకొందిన్నారు. ఇప్పటికైనా షెడ్యూల్ క్యాస్ట్ డెవలప్మెంట్ డిపార్ట్మెంట్ పోస్ట్ మెట్రిక్ హాస్టల్లో పనిచేసే ఔట్ సోర్సింగ్ వర్కర్స్‌కు 10వ తేదీలోపు చెల్లించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సంపత్, రాజేశ్వరి, అనిత, మల్లేశ్వరి, సునీత, లక్ష్మి, పద్మ ప్రేమలత, అనసూర్య, టి లక్ష్మి కె లక్ష్మి, లావణ్య పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుడి మృతికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-నస్పూర్

మున్సిపల్ కార్మికుడి మృతిపై విచారణ జరిపించి, బాధ్యులైన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం ప్రజావాణిలో అదనపు కలెక్టర్‌కువినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాతనపల్లి మున్సిపాలిటీలో వేముల రాజయ్య అను కాంట్రాక్ట్ కార్మికుడు శనివారం ఉదయం విధులు నిర్వహిస్తున్న సందర్భంలో అతనికి వాంతులు, విరోచనాలు అవడంతో తోటి కార్మికులు గుర్తించి రాజయ్య పరిస్థితిపై సూపర్‌వైజర్‌కు సమాచారం అందించారని, సూపర్‌వైజర్ అధికారులకు చెప్పడంతో రాజయ్యను చెత్త ఎత్తే ట్రాలీలో తన ఇంటికి తీసుకెళ్లి నిర్లక్ష్యంగా వదిలేశారని ఆరోపించారు. దీంతో వారి కుటుంబ సభ్యులు 108 ద్వారా మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి రాజయ్యను తరలించగా అపస్మారక స్థితిలో ఉన్న రాజయ్యను డాక్టర్లు చూసి మృతి చెందాడని డాక్టర్లు నిర్ధారించి వాళ్ళ కుటుంబ సభ్యులకు చెప్పడం జరిగిందన్నారు. పూర్తిగా రాజయ్య చనిపోవడానికి కారణం మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యమే అని, గతంలో ఇదే మున్సిపల్‌లో పనిచేసే ఇద్దరు కార్మికులు అధికారుల నిర్లక్ష్యంతో ప్రమాదానికి గురి కావడం జరిగిందన్నారు. నిర్లక్ష్యంతో ఒక ప్రాణం పోయి ఒక కుటుంబం రోడ్డున పడిందని వాపోయారు. కలెక్టర్ స్పందించి కార్మికుడు మృతి పైన సమగ్ర విచారణ జరిపించి, బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని, మతి చెందిన కార్మికుడి కుటుంబంలో ఒకరికి పర్మినెంట్ ఉద్యోగం ఇవ్వాలని, రూ.20 లక్షల ఎక్స్‌గ్రేసియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే పనిచేసే కార్మికులకి సేఫ్టీ పరికరాలు ఇవ్వాలని, ప్రతి కార్మికుడికి ఇన్సూరెన్స్ చేయించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. కార్మికులను కాపాడాలని లేకుంటే సీఐటీయూ ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

పాఠ్యపుస్తకాల పంపిణీ



నవతెలంగాణ-తాండూర్

మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు ఉచిత పాఠ్యపుస్తకాలు ఉచిత నోటు పుస్తకాలు మండల విద్యా వనరుల కేంద్రం తాండూర్ నుంచి పంపిణీ చేసినట్లు మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్ తెలిపారు. మండలంలోని 6 నుండి 12వ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు ఎంఆర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

పట్టుబడిన నకిలీ పత్తి విత్తనాలు

- 107 కిలోల నకిలీ విత్తనాలు స్వాధీనం

నవతెలంగాణ-జైపూర్



భీమారం పోలీస్ స్టేషన్ పరిధి ఆవుడం ఎక్స్ రోడ్డు వద్ద నకిలీ పత్తి విత్తనాలు (బీటీ-3) పట్టుబడినట్లు పోలీసులు తెలిపారు. నమ్మదగిన సమాచారం మేరకు సోమవారం ఆవుడం రోడ్డులో నిఘా ఏర్పాటు చేసి పట్టుకున్నట్లు రామగుండం పోలీస్ కమిషనరేట్ టాస్క్‌ఫోర్స్ ఇన్స్‌పెక్టర్ సంజయ్ తెలిపారు. భీమారం గ్రామానికి చెందిన చుండు నాగేశ్వర్ రావు 3 సంచుల్లో 107 కిలోల నకిలీ పత్తి విత్తనాలు ఆవుడం రోడ్డులో ఆటో కోసం ఎదురు చూస్తుండగా అనుమానించి తనిఖీ చేసినట్లు తెలిపారు. గుంటూరు జిల్లాకు చెందిన నాగేశ్వర్ రావు భీమారంలో నివాసముంటూ కౌలుకు వ్యవసాయం చేస్తున్నాడు. కర్నూలుకు చెందిన గుర్తు తెలియని వ్యక్తి వద్ద తక్కువ ధరతో కొనుగోలు చేసి మంచిర్యాల పరిసర ప్రాంతాల్లో అత్యధిక ధరతో అమ్మడం కోసం తీసుకువచ్చినట్లు నాగేశ్వర్ రావు అంగీకరించినట్లు తెలిపారు. ఆర్టీసీ బస్సులో వచ్చి ఆవుడం ఎక్స్ రోడ్డులో దిగి ఆటో కోసం ఎదురుచూస్తు పట్టుబడినట్లు వారు తెలిపారు. పట్టుబడిన నకిలీ పత్తి విత్తనాల విలువ సుమారుగా రూ. 3 లక్షల 20 వేలు ఉంటుందని వివరించిన పోలీసులు తదుపరి విచారణ నిమిత్తం పట్టుబడిన నకిలీ విత్తనాలతో పాటు నాగేశ్వర్ రావును భీమారం పోలీస్ స్టేషన్‌లో అప్పగించినట్లు తెలిపారు. నకిలీ విత్తనాలు పట్టుకున్న వారిలో ఎస్సై ఉపేందర్, భీమారం ఎస్సై రాములు, వ్యవసాయ అధికారి మార్క్‌గ్లాడ్సన్‌తో పాటు సిబ్బంది ఉన్నారు.

విడతల వారీగా సమస్యలు పరిష్కరిస్తా

- చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి



నవతెలంగాణ-జైపూర్

నియోజకవర్గం పరిధిలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి హామీ ఇచ్చారు. సోమవారం నియోజకవర్గం పరిధిలో పర్యటించిన ఆయన చెన్నూర్ క్యాంపు కార్యాలయంలో పట్టణ ప్రజలతో సమావేశయ్యారు. ఈ సంధర్భంగా పట్టణ ప్రజలతో పాటు నియోజకవర్గం పరిధి ప్రజలు వివరించిన సమస్యల పట్ల స్పందించారు. పంటల సాగుకు సంబంధించిన రైతులకు విత్తనాలు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. దీనికి ముందు కోటపల్లి మండలం నక్కలపల్లి గ్రామంలో కొనసాగుతున్న మారెమ్మ, సద్వలమ్మ జాతరలో పాల్గొని మొక్కులు చెల్లించారు. నక్కలపల్లి ప్రజలతో పాటు చెన్నూర్ నియోజకవర్గం ప్రజలు సుభిక్షంగా ఉండాలని కోరారు. ఎన్నికలకు ముందు గ్రామస్థులకు ఇచ్చిన హామీ మేరకు అటవీ అధికారులతో మాట్లాడి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ఆదేవిధంగా నక్కలపల్లి గ్రామంలో ఈజీఎస్ నిధులు రూ.5 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. చెన్నూర్ పట్టణ పరిధిలో గల పెద్ద చెరువులో చేపల పెంపకం విషయంలో ముదిరాజ్, బెస్త కుటుంబాలకు మధ్య తలెత్తిన వివాదం పరిష్కరించడం కోసం రాష్ట్ర మత్స్యశాఖ కమీషనర్‌తో మాట్లాడుతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఇసుక తరలిస్తున్న టిప్పర్ పట్టివేత



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని తపాల్‌పూర్ చెక్ పోస్ట్ వద్ద అక్రమంగా తరలిస్తున్న ఇసుక టిప్పర్‌ను ఆదివారం రాత్రి తాళ్లపేట రేంజ్ అధికారి సుష్మారావు పట్టుకున్నారు. పట్టుకున్న ఇసుక టిప్పర్‌ను తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డికి అప్పగించారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఇసుక టిప్పర్ ఉట్నూరుకు చెందిన వారధిగా గుర్తించి రూ.15000 జరిమానా విధించినట్లు తహసీల్దార్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ట్రాక్టర్ల ద్వారా జేసీబీల సహాయంతో వాగులలో నుంచి గోదావరి నుంచి ఇసుక తీసి, బ్రిక్స్ తయారీ కేంద్రాలకు తరలిస్తే పట్టుకొని వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. అక్రమ ఇసుక రవాణా నేరమన్నారు. వాగులు గోదావరి నుంచి ఇసుక తీయడం వల్ల భూగర్భ జలాలు అంతరించే పోయే ప్రమాదం ఉందన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజావాణి కార్యక్రమం



నవతెలంగాణ-జన్నారం

ప్రజల మేలుకోసమే ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తహసీల్దార్ రాజ మనోహర్‌రెడ్డి, ఎంపీడీఓ శశితల అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశం మందిరంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ప్రజల వద్ద నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను సాధ్యమైనంతవరకు ఇక్కడే పరిష్కారం చేస్తామన్నారు. సాధ్యం కానీ ఫిర్యాదులను కలెక్టరేట్ కార్యాలయానికి పంపించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఈఓ రమేష్, ఈజీఎస్ ఏపీఓ రవీందర్ ఏఓ సంగీత పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్ ఫోన్ అప్పగింత

జన్నారం : మండలంలోని ఫోన్కల్ గ్రామపంచాయతీకి చెందిన కోరుకంటి మనోహర్‌రావు అనే వ్యక్తి గత నెల 12న తన ఫోన్ రియల్ మీ 10 ప్రో పొగొట్టుకున్నారు. అదే రోజు స్థానిక పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎస్సై రాజ వర్ధన్ సైబర్ క్రైమ్ పీసీ రవీందర్,(సీఈఐఆర్) నెంబర్ ద్వారా ఆ ఫోన్‌ను గుర్తించి సోమవారం బాధితుడు కోరికంటి మనోహర్‌కు అందజేశారు. సందర్భంగా బాధితుడు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
మంగళవారం | జూన్ 11, 2024 | www.navatelangana.com

బాధిత కుటుంబాలకు పరామర్శ

నవతెలంగాణ-సారంగాపూర్



మండలంలోని కంకట గ్రామంలో మేకల చిన్న గంగన్న, మలక్ చించోలి గ్రామంలో పడాల పోశెట్టి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలను పరామర్శించిన వారిలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు బోల్లోజి నర్సయ్య, ప్రధాన కార్యదర్శి ముత్యం రెడ్డి, కార్యదర్శి దాసరి లక్ష్మణ్, స్వర్ణ ప్రాజెక్టు చైర్మెన్ నారాయణరెడ్డి, నాయకులు మారుతి, పృధ్వి రాజ్ రెడ్డి ఉన్నారు.

సమస్యల పరిష్కారం కోసమే ఫిర్యాదుల విభాగం

నవతెలంగాణ-ముధోల్



ప్రజలసమస్యల పరిష్కారం కోసమే ప్రజాఫిర్యాదుల విభాగాన్ని నిర్వహిస్తున్నామని ముధోల్ తహసీల్దార్ విఠల్ అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించారు. ఎవైన సమస్యలు ఉంటే ప్రజావాణిలో పరిష్కరించుకొని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ మైసాజీ, పశువైద్యాధికారి డా.రాజేష్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణాన్ని రక్షించాలి



నవతెలంగాణ-నస్పూర్

ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణాన్ని రక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఇన్‌చార్జి జనరల్ మేనేజర్ పురుషోత్తమరెడ్డి అన్నారు. సోమవారం ఎస్ఆర్పీ-1 గనిలో శ్రీరాంపూర్ గ్రూప్ ఆఫ్ మైన్స్ ఏజెంట్ గోపాల్‌సింగ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమానికి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా సింగరేణి యాజమాన్యం శ్రీరాంపూర్ ఏరియాలో మొక్కలు నాటుతూ వాటిని పరిరక్షిస్తూ వాతావరణ కాలుష్యం జరగకుండా అన్ని జాగ్రత్త చర్యలు తీసుకుంటుందని, అలాగే మన భావితరాలకు మంచి గాలి, నీరు అందించడానికి ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మొక్కలను నాటాలని తెలిపారు. వీలైనంత వరకు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని, ప్లాస్టిక్ వినియోగించకుండా ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా జ్యూట్ బ్యాగులను వినియోగించాలని సూచించారు. మనం నిర్వహించే వివిధ కార్యక్రమాలలో ప్లాస్టిక్ గ్లాసులు, ప్లాస్టిక్ సంబంధిత వస్తువులను వీలైనంతవరకు ఉపయోగించకుండా ఉండేందుకు ప్రయత్నించాలని సూచించారు. గని ఆవరణలో మొక్కలను నాటి వాటిని సంరక్షిస్తూ ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఏరియా గుర్తింపు కార్మిక సంఘం(ఏఐటీయూసీ) ఏరియా బ్రాంచ్ సెక్రెటరీ బాజీసైదా, అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రెటరీ మోతుకూరి కొమురయ్య, ఏరియా ఎన్విరాన్మెంటల్ ఆఫీసర్ హనుమాన్‌గౌడ్, గని మేనేజర్ విజయ్ కుమార్, సేఫ్టీ ఆఫీసర్ చంద్ర ముర్ము, ఇంజనీర్లు శంకరయ్య, రాజేందర్ అండర్ మేనేజర్లు నరేష్, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

భాషా పండితులు, పీఈటీల ధ్రువపత్రాల పరిశీలన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పదోన్నతుల కోసం భాషా పండితుల సర్టిఫికెట్ వేరిఫికేషన్ ప్రక్రియ సోమవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 314 ఖాళీలుండగా భాషా పండితులు, పీఈటీల సర్టిఫికెట్ల పరిశీలన చేశారు. ఆయా పాఠశాలల్లో పని చేస్తున్న 220 మంది భాషా పండితులు, 25 మంది పీఈటీలు డీఈఓ కార్యాలయానికి చేరుకున్నారు. ఉపాధ్యాయుల సర్టిఫికెట్లను తీసుకొని పరిశీలించనున్నారు. పరిశీలన అనంతరం త్వరలోనే వీరికి పదోన్నతులు వచ్చే అకాశాలున్నాయి. ఈ సందర్భంగా డీఈఓ ప్రణీత మాట్లాడుతూ ఇది వరకే ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియ పూర్తయి రీలివ్ అయ్యారని తెలిపారు. బదిలీల్లో భాగంగా భాషా పండితులు, పీఈటీల సర్టిఫికెట్ వేరిఫికేషన్ చేపట్టినట్లు తెలిపారు. ఈ ప్రక్రియ పారదర్శంగా ఉంటుందని పేర్కొన్నారు.

పోలీసుల వాహన తనిఖీలు



నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని మహారాష్ట్ర సరిహద్దు గ్రామమైన సిరిపెల్లిలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద సోమవారం ఎస్సై శ్రీకాంత్ వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీల్లో ఏఎస్సై మాన్‌సింగ్, హెడ్ కానిస్టేబుల్ రాములు, కానిస్టేబుల్ ప్రణీత్‌రెడ్డి పాల్గొన్నారు.

పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



షెడ్యూల్ కులాల శాఖల ద్వారా అమలవుతున్న పథకాలను జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ద్వారా అమలవుతున్న పథకాలు, శాఖ ద్వారా నిర్వహించబడుతున్న వసతిగృహాల వివరాలను తెలిపే కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శాఖ ద్వారా అమలవుతున్న పథకాలను జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, వసతి గృహాల్లో ఉచిత భోజనం, చదువుకోవడానికి అవసరమైన ప్రతిదీ ఉచితంగా అందజేయబడతాయని తెలిపారు. 3వ తరగతి నుండి 10వ తరగతి, ఆపై తరగతి ఉన్న విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల్ని వసతిగృహాల్లో చేర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలదేవి, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి సునీత, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శంకర్, బీసీ శాఖ అధికారి రాజలింగు పాల్గొన్నారు.

ప్రారంభమైన ప్రజావాణి.. వెల్లువలా అర్జీలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పార్లమెంట్ ఎన్నికల కోడ్ నేపథ్యంలో దాదాపు మూడు నెలల పాటు రద్దయిన ప్రజావాణి సోమవారం ప్రారంభమైంది. కలెక్టర్ సమావేశ మందిరంలో అధికారులకు తమ సమస్యలను తెలియజేసుకునేందుకు జిల్లా నలుమూలల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి అర్జీలను అందించారు. ప్రజావాణిలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రాజర్షిషా ప్రజల సమస్యలను ఓపిగ్గా వింటు పరిష్కరించేలా చూడాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. అధికారులకు ప్రజలు నమ్మకంతో ఇచ్చే అర్జీలపై నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. కాగా ఒక్కరోజే ప్రజావాణి ద్వారా నలుమూలల నుండి వచ్చిన 62 మంది నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖ అధికారులు పాల్గొన్నారు.

కరెంట్ బిల్ సమస్యను పరిష్కరించాలి

జీరో కరెంట్ బిల్ రాక అధిక కరెంట్ బిల్లుతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పట్టణంలోని రణదీవ్‌నగర్ వాసులు వాపోయారు. ఈ



ఆదిలాబాద్‌లో..



ఆదిలాబాద్‌లో..

విషయమై సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజావాణి వద్దకు వచ్చి వారి బాధను వెళ్లబోసుకున్నారు. మహాలక్ష్మి పథకం కింద జీరో కరెంట్ బిల్లు కోసం ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకున్నప్పటికీ తమకు యధావిధిగా కరెంట్ బిల్లు వస్తుందని వాపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉచిత కరెంట్ ఇస్తామని చెప్పి మోసం చేస్తుందన్నారు. ముందు రెండు 3వందలు కరెంట్ బిల్ వచ్చేదని, ఇప్పుడు వేలల్లో వస్తుందన్నారు. కూలీ పనిచేసే తమకు వేల రూపాయల బిల్లులు ఎలా కట్టాలని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ఇకనైనా స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

భూకబ్జాదారులను అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలి..

పట్టణంలోని కైలాస్‌నగర్‌లో సొసైటీకి సంబంధించిన 8 ప్లాట్లలో 2 ప్లాట్లని తప్పుడు ధ్రువ పత్రాలతో కబ్జాలు చేయడానికి ప్రయత్నించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కాలనీ డెవలప్‌మెంట్ కమిటీ అధ్యక్షులు లోక ప్రవీణ్‌రెడ్డి, ఉపాధ్యక్షులు దుర్గం శేఖర్ కోరారు. ఈ విషయమై సోమవారం కలెక్టర్ రాజర్షిషాను ప్రజావాణి విభాగంలో కలిసి సమస్యను విన్నవించి వినతిపత్రం అందజేశారు. భూకబ్జాదారులను అరెస్ట్ చేసి శిక్షించాలని అన్నారు. విషయమై తక్షణమే స్పందించిన కలెక్టర్ సంబంధిత అధికారులను దర్యాప్తు చేపట్టాలని ఆదేశించారు.

నిర్మల్ : ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి, పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఇప్పటి వరకు శాఖల వారిగా పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి, దరఖాస్తుల పరిశీలన చేపట్టి ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ధరణి, రెవెన్యూ, వ్యవసాయం, కొత్త రేషన్ కార్డులు, ఫించన్లు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, భూ సమస్యల వంటి అంశాలపై ఫిర్యాదులు అధికంగా వచ్చాయని సంబంధిత శాఖల అధికారులు దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, డీఆర్ఓ భుజంగ్‌రావు, ఆర్డీఓ రత్నాకళ్యాణి, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



నిర్మల్‌లో..

భారీ వర్షాలు, వరదలతో ప్రజలకు

ఇబ్బందులు కల్గకుండా చర్యలు చేపట్టాలి

• రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క

నవతెలంగాణ-నిర్మల్

భారీ వర్షాలు, వరదలతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అన్నారు. సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో వర్షాకాలం నేపథ్యంలో తీసుకోవలసిన చర్యలపై ఆమె రాష్ట్ర ఉన్నత అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. క్లోరినేషన్ చేపట్టిన తర్వాతే ప్రజలకు తాగు నీటిని సరఫరా చేయాలని, పురాతన ఇండ్లలో నివాసం ఉంటున్న వారిని వెంటనే ఖాళీ చేయించాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో జరుగుతున్న మిషన్ భగీరథ సర్వేను పకడ్బందీగా చేపట్టాలని, ప్రభుత్వ పాఠశాలల పిల్లలకు పంపిణీ చేసే ఏకరూప దుస్తుల తయారీ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. వర్షాకాలం ఇబ్బందులు ఏర్పడకుండా తీసుకుంటున్న చర్యలు, మిషన్ భగీరథ సర్వే ఏకరూప దుస్తుల తయారీ వంటి అంశాలపై జిల్లాల



వారీగా మంత్రి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ, జిల్లాలో భారీ వర్షాలు, వరదలతో ఆస్తి, ప్రాణ నష్టం జరుగకుండా అవసరమైన ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మిషన్ భగీరథ సర్వేను పకడ్బందీగా నిర్వహిస్తామని, నిర్దీత గడువులోగా ఏకరూప దుస్తుల తయారీని పూర్తి చేస్తామని వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, జెడ్పీ సీఈవో గోవింద్, డీఆర్డీఓ విజయలక్ష్మి, మిషన్ భగీరథ ఈఈ సందీప్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్‌లో ఉన్న నాలుగు నెలల వేతనాలు చెల్లించాలని మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లింగాల చిన్నాన్న అన్నారు. సోమవారం సీఐటీయూ కార్యాలయంలో సంఘం జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు వేతనాల గురించి చర్చించారు. అనంతరం సీఐటీయూ కార్యాలయం నుంచి ర్యాలీగా కలెక్టరేట్ వరకు వెళ్లి నిరసన తెలిపి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లింగాల చిన్నన్న మాట్లాడుతూ ప్రభుత్వం డబ్బులు ఇవ్వకున్న అప్పులు చేసి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజన కార్మికులు రుచికరమైన భోజనం వడ్డిస్తున్నారని తెలిపారు. అయిన వారికి ఇచ్చే గౌరవ వేతనం రూ.2 వేలు నెలనెల ఇవ్వకపోడడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు నెలల వేతనాలతో పాటు వసతి గృహాల మదిరిగా నిత్యావసర సరకులను ప్రభుత్వమే మధ్యాహ్న భోజనానికి అందించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు చేపడుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మెస్రం కిషన్, ఉపాధ్యక్షురాలు లక్ష్మి, తులసీ, సహాయ కార్యదర్శి నర్సమ్మ, గంగామణి, సహేర, నహేద, సక్కుబాయి, నర్మద, శ్యామల పాల్గొన్నారు.

రైస్ మిల్లర్లపై చర్యలు తీసుకోవాలి

• కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన రైతులు

నవతెలంగాణ-ఖానాపూర్

వడ్ల కొనుగోలు విషయంలో రైతులను మోసం చేసిన రైస్ మిల్లర్లపై కఠినమైన చర్యలు తీసుకోవాలని సోమవారం మండలంలోని గోడల పంపు, గోసం పల్లె, సత్తన్‌పల్లి గ్రామాల రైతులు, రైతు సంఘం నాయకులు ఫిర్యాదు చేశారు. రైతులను మోసం చేసి వడ్లను కొనుగోలు చేసి కోతను విధించిన రైస్ మిల్లర్లు వద్దనుంచి వడ్లను వెంటనే రికవరీ చేయాలని కలెక్టర్‌కు విన్నవించారు. ఈ సందర్భంగా ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి అల్లెపు పీటర్ రైతులు మాట్లాడుతూ రైతుల నుంచి అక్రమంగా రెండు లారీల వడ్లకు 102 సంచులు దోచుకుని లేనిపోని వంకలు పెట్టుతన్నారని అన్నారు. అటువంటి రైసుమిల్లలపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకుని బ్లాక్ లిస్టులో పెట్టి వారిపై కేసులు నమోదు చేయాలని అన్నారు. రైతుల



కష్టాన్ని దోపిడీ చేస్తున్న రైస్ మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అంతేకాకుండా అలాంటి రైస్ మిల్లర్లను వెంటనే సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులతో కలిసి కలెక్టరేట్ ఎదుట రైతులతో కలిసి నిరాహార దీక్షలు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో గోసంపల్లి, గోడల పంపు రైతులు కరిపే ప్రకాష్, దాత్రికి కుమార్, ఈసారపు నవీన్, డి.రాజు నాయక్, మత్తలేరి లక్ష్మీరాజం ఉన్నారు.

నిరుపేదలకు పట్టాలు పంపిణీ చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మావల మండల పరిధిలోని సర్వే నంబర్ 170లో ఏండ్లుగా నివాసం ఉంటున్న పేదలకు పట్టాలతో పాటు పక్కా ఇండ్లు నిర్మించి, ఇవ్వాలని సీపీఐ(ఎంఎల్) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వెంకటనారాయణ డిమాండ్ చేశారు. సోమవారం 170లో నివాసం ఉంటున్న పేదలతో కలిసి కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సౌకర్యాలు కల్పించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎంఎల్) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వెంకటనారాయణ మాట్లాడుతూ అధికారంలోకి వస్తే పేదలకు ఇండ్ల స్థలాలతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇస్తామని ప్రకటించిందన్నారు. ఈ హామీమేరకు 170లో గుడిసెలు వేసుకోని 8 సంవత్సరాల నుంచి నివాసం ఉంటున్న పేదలకు పట్టాలతో పాటు ఇండ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. అదే విధంగా వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో కాలనీల్లో సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐఎస్టీయూ నాయకులు సుభాష్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హరీశ్, శ్రీకర్, దండేకర్ వామన్, గంగమ్మ, తారాబాయి, రఫీక్, ఖయ్యుం పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నవతెలంగాణ-ముధోల్

మండలంలోని అష్ట గ్రామంలో 2010-11 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు సోమవారం ఆత్మీయ [illegible] నిర్వహించుకున్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కలిసి చదువుకున్న విద్యార్థులు 13 సంవత్సరాల తరువాత ఒకచోట కలుసుకొని సందడి చేశారు. స్నేహితులు ఒకరి కొకరు ఆప్యాయంగా పాలకరించుకొని, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఇలా కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఒకరినొకరు ఆత్మీయంగా పలుకరించుకున్నారు . ఈ సందర్భంగా విద్యాబుద్దులు నేర్పించిన గురువులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గురువులు కానం రాజేశ్వర్, నరేష్, గంగన్న, ఇంద్రసేనరెడ్డి, భూషణ్, పూర్వ విద్యార్థులు అనిల్, భరత్, గంగాధర్, శ్యామ్, అన్వేష్, వినోద్, ప్రవీణ్, అజయ్, గంగామణి, సునీత, చిన్నమ్మ, ఆమని, లక్ష్మి పాల్గొన్నారు.

తపాలా శాఖ కార్యాలయంలో చోరీ

• రూ.6వేల9వందల నగదు, స్టాంపులు చోరీ

నవతెలంగాణ-ఇచ్చోడ



తపాలశాఖ కార్యాలయంలో చోరీ జరిగిన సంఘటన సోమవారం ఇచ్చోడ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. తపాలశాఖ అధికారి, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... వరుసగా రెండు రోజులు సెలవులు కావడంతో సోమవారం పోస్ట్ ఆఫీస్ కార్యాలయానికి సిబ్బంది వచ్చి చూసేసరికి కిటికీలు బీరువాలు పగలగొట్టి ఉండటం గమనించిన సిబ్బంది ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. బ్రాంచ్ మేనేజర్ అబ్దుల్ నిషాద్ షేక్ వెంటనే పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు. ఘటన స్థలానికి పోలీసులు చేరుకొని పరిశీలించారు. తపాలా శాఖ కార్యాలయంలో గుర్తుతెలియని దొంగలు చొరబడి రూ.6వేల 9వందల నగదు, రూ.11వేల పోస్టేజ్ స్టాంపులు, 36 రెవెన్యూ స్టాంపులు, రూ.7వేల ఐపీఓ స్టాంపులు, 4 వందల పోస్ట్ ఆఫీస్ బుక్స్ దొంగిలించారని బ్రాంచ్ మేనేజర్ తెలిపారు. శనివారం, ఆదివారం సెలవు కావడంతో ఈ ఘటన శనివారం రాత్రి, ఆదివారం రాత్రి జరిగిందా అనే కోణంలో విచారణ చేపట్టారు. బ్రాంచ్ మేనేజర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై నరేష్ కుమార్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

నవతెలంగాణ-నేరడిగొండ



మండల కేంద్రంలోని రోల్‌మామడ గ్రామ సమీపంలోని 44 జాతీయ రహదారిపై సోమవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. మండలం శంకరాపూర్ గ్రామానికి చెందిన జాదవ్ రాజు(35) కేఎస్ఆర్ రోడ్డు సంస్థలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేసేవాడు. సోమవారం చెట్లకు నీరు పోస్తున్న క్రమంలో సమయంలో వెనక నుంచి వేగంగా వచ్చిన లారీ ట్యాంకర్‌ను ఢీకొనడంతో ప్రమాద స్థలంలోనే మృతి చెందాడు. కేఎస్ఆర్ నిర్లక్ష్యం వల్లే మృతి చెందాడని కుటుంబీకులు రాజు మృతదేహాన్ని సంఘటన స్థలంలో రోడ్డుపై ఉంచి, కుటుంబానికి న్యాయం చేయాలని ధర్నాకు దిగారు. మృతుడికి భార్య, ఐదు సంవత్సరాల కూతురు ఉంది. రోడ్డుకు ఇరువైపులా మూడు నుంచి నాలుగు కిలోమీటర్ల వరకు వాహనాలు నిలిచిపోయాయి. బోథ్ నియోజకవర్గ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హామీ మేరకు ఈ ధర్నాను విరమించుకున్నట్టు గ్రామస్తులు స్థానికులు తెలిపారు. అనంతరం మృతదేహాన్ని బోథ్ ప్రభుత్వాస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.